ప్రజాశక్తి

ఆదివారం 31 మార్చి 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ప్రచార క్షేత్రంలో ప్రధాన పార్టీలు

విశాఖలో ముమ్మరంగా అభ్యర్థుల పర్యటనలు

తూర్పులో ప్రచారం నిర్వహిస్తున్న వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవివి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

సార్వత్రిక ఎన్నికల కోసం ప్రధాన రాజకీయ పార్టీలు తమ తమ అభ్యర్థులను విశాఖ వరకూ దాదాపు ఖరారు చేసేశాయి. దీంతో ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ప్రచార వ్యూహంలో పోటీపడుతూ అభ్యర్థులు పర్యటనలు చేపడుతున్నారు. తెలుగుదేశం, బిజెపి, జనసేన కూటమిగా ఏర్పాటైన తర్వాత జిల్లాలోని అసెంబ్లీ అభ్యర్థులు, ఎంపీ అభ్యర్థి విషయంలో కొంతమేర జాప్యం జరిగిన విషయం తెలిసిందే. వైసిపి మాత్రం సిట్టింగులకే ప్రాధాన్యమిచ్చి కాసింత ముందుగానే అభ్యర్థులను ప్రకటించింది. దీంతో వారు కూటమి అభ్యర్థుల కన్నా ముందుగానే ప్రచారం ఆరంభించారు. ముఖ్యంగా నగరంలోని దక్షిణం, భీమిలి సీట్ల విషయంలో కూటమి అభ్యర్థుల ఖరారులో తీవ్ర జాప్యం జరిగింది. ఎట్టకేలకు ఈ నెల 29న భీమిలికి టిడిపి మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావును అభ్యర్థిగా ప్రకటించారు. 2014లో గంటా ఇక్కడ గెలిచారు. ఆ తర్వాత ఉత్తరం నియోజకవర్గానికి 2019లో తరలిపోయారు. మళ్లీ భీమిలికే ఆయన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తూ చంద్రబాబు టికెట్ ఇచ్చారు. శనివారం నుంచి ఆయన ప్రచారం ప్రారంభించారు. ఇదిలా ఉండగా భీమిలిలో మాజీ మంత్రి, సిట్టింగ్ ఎంఎల్ఎ ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఇప్పటికే నియోజకవర్గంలో జోరుగా ప్రచారం నిర్వహించారు. సభలు, సమావేశాలు, ముఖ్య నేతలతో భేటీలు చేపట్టారు.

ఆ నాలుగు సెగ్మెంట్లే ఎంపీ అభ్యర్థులకూ కీలకం

విశాఖ తూర్పు, పశ్చిమం, దక్షిణం, ఉత్తరం అసెంబ్లీలు విశాఖపట్నం పార్లమెంట్ స్థానానికి పోటీచేసే పార్టీల అభ్యర్థులకు కీలకం కానున్నాయి. కూటమి తరపున మూడు పార్టీలూ ఏకమై ప్రచారాన్ని చేపట్టిన పరిస్థితులు ఇప్పటివరకూ లేవు. విశాఖ తూర్పునకు ఎంపీ ఎంవివి.సత్యనారాయణ ఈ సారి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కావడంతో రెండు నెలలుగా ఆయన ప్రచారం చేసుకుంటున్నారు. ఇదే నియోజకవర్గంలో మిగతా 2లో..

భీమిలిలో ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి ఎంపీ అభ్యర్థి శ్రీభరత్

సిఎం రమేష్ వ్యాఖ్యలు హాస్యాస్పదం

ఉక్కుపై ఆయన కల్లబొల్లి కబుర్లను ప్రజలు నమ్మరు
సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

ప్రజాశక్తి - అనకాపల్లి : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కానివ్వబోమని, పరిశ్రమకు అవసరమైన సొంత గనులు, నిధులు రప్పించి ఆధునికీకరించి ఉపాధి కల్పిస్తామని, మూసివేసిన సుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తామని, ప్రతి నియోజకవర్గంలో పరిశ్రమలు నిర్మిస్తామని అనకాపల్లిలో శుక్రవారం జరిగిన సభలో బిజెపి ఎంపీ అభ్యర్థి సిఎం రమేష్ ప్రకటించడం చాలా హాస్యాస్పదంగా ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం పేర్కొన్నారు. సిఎం రమేష్ చేసిన వ్యాఖ్యలపై ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. గత పదేళ్ళగా ఎంపీగా వుండి రమేష్ చేసిందేమిటన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తామని కేంద్ర బిజెపి ప్రభుత్వం చెబుతుంటే దానిని ఆపడంలో మీ పాత్ర ఏమిటి ? ఈ పదేళ్ళలో మీరు అధికారంలో వుండి ప్లాంట్ పరిరక్షణకు, సొంత గనులు కేటాయించడానికి, వర్కింగ్ క్యాపిటల్‌ను ఇప్పించడంలో మీరు చేసిన కృషి ఏమిటి ? అని ప్రశ్నించారు. ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సుదీర్ఘకాలంగా కార్మికులు, ప్రజలు చేపడుతున్న పోరాటానికి సంఘీభావం కూడా ప్రకటించలేదన్నారు. ఎన్నడూ ప్రైవేటీకరణ నిలిపివేయడానికి జోక్యం చేసుకోని సిఎం రమేష్ ఎన్నికలు ముందుకు వచ్చేసరికి స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపేస్తామని మాట్లాడడం అంటే ప్రజలను మోసం చేయడమే అవుతుందన్నారు. ఉత్తరాంధ్ర వాసులకు చదువురాదు, చక్కగా మాట్లాడలేరని భాషను ఉటంకిస్తూ తనను గెలిస్తే చక్కగా మాట్లాడతానని అవహేళన చేసే విధంగా వ్యాఖ్యలు చేయడాన్ని ఖండించారు. ప్రతి ఏడాదీ రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని మోడీ యువతను మోసం చేశారన్నారు. ఇప్పుడు అనకాపల్లి ఎంపీగా తనను గెలిపిస్తే ప్రతి నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పిస్తామని సిఎం రమేష్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అసలు సుగర్ ఫ్యాక్టరీలు మూతపడడానికి కేంద్ర బిజెపి ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. అటువంటప్పుడు మరలా మూసివేసిన సుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తామని కల్లబొల్లి కబుర్లు చెప్పడాన్ని ప్రజలు ఎవ్వరూ విశ్వసించబోరన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం పదేళ్ల నుంచి ఆంధ్ర రాష్ట్రానికి, ఉత్తరాంధ్రకు, ముఖ్యంగా ఉమ్మడి మిగతా 2లో..

విద్యార్థిని ఆత్మహత్యపై కొనసాగుతున్న దర్యాప్తు

▶ వార్త మెయిన్‌లో..

ఘనంగా ఐఐఎం విశాఖ స్నాతకోత్సవం

▶ వార్త 2లో..

ఉబర్ డ్రైవర్ల సమ్మె విజయవంతం

- సిఐటియు అభినందనలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉబర్ క్యాబ్ డ్రైవర్లు విశాఖ నగరంలో నిర్వహించిన సమ్మె విజయవంతమైనది. సమ్మెలో ఏడు డిమాండ్లను ప్రతిపాదించగా ఐదు డిమాండ్లకు యాజమాన్యం అంగీకరించటంతో సమ్మెను విరమించినట్లు విశాఖ క్యాబ్ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి కె.పోలినాయుడు, అధ్యక్షులు సిహెచ్.శ్రీనివాసు మీడియాకు తెలిపారు. ఉబర్ సమ్మెలో పాల్గొన్న డ్రైవర్లందరికీ సంఘం తరపున అభినందనలు తెలిపారు. ఉబర్ యాజమాన్యం శనివారం యూనియన్‌తో చర్చలు జరిపిందన్నారు. పరిష్కరించబడ్డ డిమాండ్లను ఆయన మీడియాకు వివరించారు. కొత్తగా తీసుకుని వచ్చిన ప్లాట్ ఫామ్ ఫీజు రోజుకు రూ.39 రద్దు చేయబడిందని తెలిపారు. ప్రారంభంలో కనీస రేట్లు ఉబర్ గోకి రూ.60 నుంచి 82కి, ప్రైమ్‌కి రూ.71 నుంచి 92కి పెంచారన్నారు. నైట్ ఛార్జెస్ రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు 50 శాతం పెంచాలని యూనియన్ కోరగా 25 శాతం పెంపునకు అంగీకారం తెలిపారన్నారు. ఇంటర్ సిటీ రేట్లు 10 శాతం పెంచారన్నారు. ఎస్‌యువిలు కొద్ది రోజులలో ప్రారంభిస్తామని చెప్పారన్నారు. మిగిలిన రెండు మిగతా 2లో..

ప్రాక్టీస్ చేస్తున్న ఢిల్లీ క్యాపిటల్స్ క్రీడాకారులు

ఐపిఎల్ పోరుకు సర్వం సిద్ధం

నేడు తలపడనున్న డిసి-సిఎస్‌కె
భారీ బందోబస్తు నడుమ పిఎం.పాలెం క్రికెట్ స్టేడియం

ప్రజాశక్తి - పిఎం.పాలెం : విశాఖలో ఐపిఎల్ క్రికెట్ పండగ మొదలైంది. పిఎం.పాలెం సమీపంలోని ఎసిఎ - విడిసిఎ క్రికెట్ స్టేడియం వేదికగా ఆదివారం సాయంత్రం 7:30 గంటలకు ఢిల్లీ క్యాపిటల్ - చెన్నయ్ సూపర్ కింగ్స్ జట్ల మధ్య ఐపిఎల్ మ్యాచ్ జరుగనుంది. ఇప్పటికే ఈ మ్యాచ్‌కి సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎసిఎ సెక్రటరీ గోపీనాథ్ రెడ్డి వెల్లడించారు. ఆదివారం జరిగే మ్యాచ్‌లో ధోనీని చూసేందుకు అభిమానులు భారీగా వచ్చే అవకాశముందని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే టిక్కెట్లన్నీ ఆన్‌లైన్లో హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి.

ఇరు జట్లూ ప్రాక్టీస్

శనివారం సాయంత్రం ఐదు గంటల నుండి రాత్రి 9 వరకు స్టేడియం ఆవరణలో ఇరు జట్లూ ప్రాక్టీస్ చేశాయి. అదే విధంగా ఐపిఎల్ మ్యాచ్ సందర్భంగా ఎసిఎ కార్యదర్శి ఎస్ఆర్.గోపినాథ్ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ప్రచార క్షేత్రంలో ప్రధాన పార్టీలు

వెలగపూడి రామకృష్ణ బాబు సిట్టింగ్‌గా ఉన్నారు. మూడుసార్లు టిడిపి అభ్యర్థిగా ఆయన ఇక్కడి నుంచి గెలిచారు. దక్షిణంలో వైసిపి ఎంఎల్‌ఎ వాసుపల్లి మళ్లీ పోటీ చేస్తున్నారు. కూటమి అభ్యర్థిగా జనసేన నాయకులు వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ పోటాపోటీగా పర్యటనలు చేపడుతూ ఓటర్లను కలుస్తున్నారు. పశ్చిమంలో గడచిన కొద్ది నెలలుగా వైసిపి అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ ప్రచారం చేస్తున్నారు. ఉత్తరంలో వైసిపి అభ్యర్థి కెకె.రాజు 2024 ఎన్నికల్లో తనకే టికెట్ వస్తుందన్న గ్యారెంటీతో నాలుగేళ్లగా చురుగ్గా తిరుగుతున్నారు. ఇప్పుడు మరింత స్పీడ్ పెంచారు. ఇక్కడ కూటమి తరపున బిజెపి అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు బరిలో ఉన్నారు. గాజువాక అసెంబ్లీ సెగ్మెంట్‌లో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వైసిపి తరపున, మాజీ ఎంఎల్‌ఎ పల్లా శ్రీనివాసరావు టిడిపి తరపున పోటీలో ఉన్నారు. వారూ ప్రచారంలో ఉన్నారు. విశాఖపట్నం ఎంపీ అభ్యర్థులుగా టిడిపి నుంచి ఎం.శ్రీభరత్, వైసిపి నుంచి మంత్రి బొత్స ఝాన్సీలక్ష్మి బరిలో తలపడనున్నారు. వీరు నియోజకవర్గాల్లోని తమతమ పార్టీల అభ్యర్థులతో ప్రచారంలో పాల్గొంటూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

సిఎం రమేష్ వ్యాఖ్యలు హాస్యాస్పదం : సిపిఎం

విశాఖపట్నం ప్రజలకు తీవ్ర ద్రోహం చేస్తోందన్నారు. విశాఖ మెట్రో రైలుకు అతీగతీ లేకుండా పోయిందన్నారు. రైల్వేజోన్ ఇవ్వకుండా కుంటిసాకులు చెబుతున్నారని తెలిపారు. గంగవరం పోర్టును అదానీకి అప్పజెప్పడంలో కేంద్ర బిజెపి కీలకంగా వ్యవహరించిందని పేర్కొన్నారు. ఉత్తరాంధ్రకు ఇవ్వాల్సిన ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వకుండా అన్యాయం చేసిందన్నారు. పోలవరం ప్రాజెక్టు నిధులు కేటాయించలేదని తెలిపారు. ఉత్తరాంధ్ర జీవనాడిగా పేరొందిన సుజల స్రవంతి ప్రాజెక్టు నేటికీ పూర్తికాని విషయాన్ని లోకనాథం గుర్తుచేశారు. విభజన చట్టంలో పేర్కొన్న ఏ అంశాన్నీ అమలు చేయకుండా ద్రోహం చేశారన్నారు. కడప స్టీల్‌ప్లాంట్ కోసం, విభజన హామీలకు కోసం పోరాటం చేశానన్న సిఎం రమేష్ ఈ ఐదేళ్ళ కాలంలో రాజ్యసభ సభ్యునిగా బిజెపి ప్రభుత్వంలో వుండి ఏ ఒక్క అంశంపైనా ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ఇప్పుడు ఇంత హఠాత్తుగా అనకాపల్లిపై ప్రేమ చూపించడమంటే తమ రాజకీయ ప్రయోజనాలకు తప్ప ఈ ప్రాంత ప్రజల అభివృద్ధి కోసం కాదనేది స్పష్టమవుతోందన్నారు. అనకాపల్లి ప్రాంతంలో లక్షల కోట్లు విలువ చేసే భూములు, సహజ వనరులున్నాయని, వీటన్నింటినీ కొల్లగొట్టడానికి వీరు వస్తున్నారు తప్ప ఈ ప్రాంత అభివృద్ధి కోసం కాదనేది ప్రజలందరూ అర్థం చేసుకోవాలని కోరారు. ఆంధ్ర రాష్ట్రానికి అన్నింటా అన్యాయం చేసిన బిజెపితో జతకట్టిన తెలుగుదేశం, జనసేన పార్టీలకు ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు.

దెయ్యాలు వేదాలు వల్లించినట్టుంది : సిఐటియు

అనకాపల్లిలో సిఎం రమేష్ చెప్పిన మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉన్నాయని ఓ ప్రకటనలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రుత్తల శంకరరావు, జి.కోటేశ్వరరావు ఎద్దేవా చేశారు. పదేళ్ల కాలంగా రాజ్యసభ సభ్యునిగా ఉన్న రమేష్ ఒక్కరోజైనా విశాఖ స్టీల్‌ప్లాంట్ కోసం మాట్లాడారా ? అని ప్రశ్నించారు. అనకాపల్లి సరిహద్దులే తెలియని వ్యక్తి ఇప్పుడు గెలిపిస్తే పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తాననడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బ్యాంకులకు వేల కోట్ల రూపాయలు ఎగ్గొట్టి వాటిని కాపాడుకోవడానికి బిజెపిలో ఆయన చేరారని విమర్శించారు. కార్మిక వర్గానికి నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్స్‌ను, రైతాంగానికి నష్టం కలిగించే మూడు వ్యవసాయ చట్టాలను తీసుకువచ్చినప్పుడు ఆమోదం తెలిపిన వ్యక్తి ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని జిల్లా ప్రజలు, కార్మికులు గుర్తెరిగి అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ఉబర్ డ్రైవర్ల సమ్మె విజయవంతం

డిమాండ్లయిన వే బిల్లు చూపించడం, మైనస్ బ్యాలెన్స్ వెయ్యి రూపాయలకు పెంచడంపై యాజమాన్యంతో మాట్లాడుతామని చర్చల సందర్భంగా ఉబర్ మేనేజర్ యశ్వంత్ హామీ ఇచ్చారన్నారు. చర్చల్లో సిఐటియు విశాఖ క్యాబ్ డ్రైవర్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ శ్రీనివాసు, కె.పోలినాయుడు, నాయకులు సిమ్మ శ్రీను, ఆనంద్, నాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారన్నారు. ఐక్య పోరాటం వల్లే ఈ విజయం సాధ్యమైందన్నారు.

ఐపిఎల్ పోరుకు సర్వం సిద్ధం

రెడ్డి, విశాఖ సిటీ పోలీస్ కమిషనర్ రవిశంకర్ శనివారం సాయంత్రం క్రికెట్ స్టేడియం లోపల, బయట కల్పించనున్న భద్రతపై స్థానిక పోలీస్ అధికారులతో చర్చించారు. ప్రేక్షకులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

వికలాంగుల పాఠశాలకు స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వికలాంగుల పాఠశాలకు రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించాలని సన్ ఫ్లవర్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి ఎంఎన్.కుమారి విజ్ఞప్తి చేశారు. శనివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ సన్ ఫ్లవర్ ఎడ్యుకేషనల్ సొసైటీని 1986లో స్థాపించామని తెలిపారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్‌ఐఒఎస్) పదో తరగతి నిర్వహణకు గుర్తింపు ఇచ్చినట్లు తెలిపారు. డ్రాపౌట్స్ నివారణ కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. తాము చేస్తున్న సేవలను తెలియజేశారు. ఇంత వరకూ రాష్ట్ర ప్రభుత్వం తమకు స్థలం కేటాయించలేదని విచారం వ్యక్తం చేశారు. స్వచ్ఛంద సేవా సంస్థలకు ప్రభుత్వం భూమి కేటాయించాలని ప్రభుత్వ జిఒ కూడా వుందని ఆమె గుర్తు చేశారు. సమావేశంలో సొసైటీ సలహాదారు ఎంవి.రాజశేఖర్, పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి పాల్గొన్నారు.

వంచకులతో ప్రగతికి అవరోధం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

పదవులతో విలువ రాదు. విలువ కోసం పదవి కాదు. పదవి డబ్బు కోసం కానేకాదు. పదవనేది తనను ఎనుకున్న పౌరుల హితానికి ఉపయోగించాల్సిన సాధనం. వ్యాపార, వ్యవహారాలు చక్కబెట్టుకోవడానికి, ఆక్రమణ, దురాక్రమణలతో పరువు, మర్యాదలు వదులుకొని నిస్సిగ్గుగా ఆస్తులు పోగుచేసుకోవడానికి ఇదొక ఆయుధం కాదు. వ్యాపారవనర పదవులకు మోకాళ్లపై పడి అభ్యర్థించే అభ్యర్థుల కంటే, అభివృద్ధికి దారులు వేసే ఆలోచనపరులకు అండగా నిలవాలి. ఎన్నికలు కదా...! ఎన్నికలలైనా ప్రదర్శిస్తారు. ఎన్ని పాత్రలైనా పోషిస్తారు. ఎన్ని విన్యాసాలైనా చేస్తారు. అబద్ధాలు, అర్ధసత్యాలు చెప్పి, గారడెక్కి గారడీలు చేసే చొరవగా ప్రజల్లోకి వెళ్తారు. ఇప్పుడంతా వంగుబాటు, లొంగుబాటు తప్ప ఎగిసపాటు వుండదు. ఎన్నికల వరకు ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు మైమరిపించేలా పోషించే పాత్రలకు ప్రజలు ఏమరపాటు చెందకూడదు. సీట్లు ఇచ్చినా, ఓటున్న ఇంటికి చీరలిచ్చినా, రేపు ఓటుకు నోటిచ్చినా ఇవన్నీ ఎన్నికల్లో గెలవడానికి పెడుతున్న ప్రలోభాలు.

సిపిఎం, సిపిఐ అభ్యర్థులు మినహా వైసిపి, టిడిపి, బిజెపి, జనసేన నుంచి బరిలోవున్న అభ్యర్థుల్లో అధికమంది ఏదో ఒక వ్యాపారంలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో భాగస్వాములే. వీరెవరూ వామపక్ష పార్టీ అభ్యర్థుల వలె సమాజ హితం కోసం, ప్రజల సేవ కోసం ఎన్నికల బరిలో వున్నవారు కాదు. పెట్టిన ఖర్చు రాబట్టుకోవడమెలా అన్న అజెండా తప్ప, గెలిపించిన ప్రజలకు ఏ మేలు చేయాలన్న ఆలోచించే వ్యక్తులుకారు కనుకనే, విశాఖకు వన్నె తెచ్చిన స్టీల్‌ప్లాంట్‌ను మోడీ ప్రభుత్వం వంద శాతం అమ్మకానికి పెట్టినా అడ్డుకోవడానికి ఈ పార్టీలేవీ సిద్ధపడలేదు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు సిపిఎం చేసే పోరాటానికి ఈ పార్టీలు తోడుగా నిలబడి, మోడీ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తే స్టీల్‌ప్లాంట్‌కు ఈ గతి తప్పేది. మోడీ భజనచేసే పులకరిస్తున్నాయి తప్ప స్టీల్‌ప్లాంట్‌ను

కాపాడుకోవాలన్న సంకల్పం ప్రధాన పార్టీలకు లేదు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కుయుక్తులపై ఏనాడూ నోరువిప్పని బిజెపి రాజ్యసభ సభ్యుడు, ఆ పార్టీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సిఎం రమేష్ తనను గెలిపిస్తే ప్రయివేటీకరణ నిలిపేస్తానని నిస్సిగ్గుగా చెప్పుకొచ్చారు. ప్లాంట్ పరిరక్షణకు స్టీల్ ఉద్యోగులు, కార్మికులు సుదీర్ఘకాలంగా చేస్తున్న పోరాటానికి ఆయన ఏనాడూ మద్దతు ఇచ్చినదీ లేదు. ప్లాంట్‌ను పరిరక్షించాలని పెద్దల సభలో మాట్లాడినదీలేదు. సొంత గనులు కేటాయించాలని కోరినదీలేదు. ముందున్న ఎన్నికల్లో లబ్ధి కోసం ఆడని అబద్ధాలుండవు. చేయని మోసాలుండవు, పెట్టని ప్రలోభాలుండవు. ప్రధాన రాజకీయ పార్టీ అభ్యర్థులందరూ తరతమస్థాయిలో ప్రజలను మరోసారి వంచించడానికి ప్రయత్నాలు ఆరంభించారు.

కానీ ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని గ్రామీణ ప్రాంత అభివృద్ధి అవకాశాలపై వీరెవరూ మాట్లాడ్డంలేదు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు రప్పించి, ఎడమ కాలువ, తరువాత ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తిచేయిస్తామని ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు హామీ ఇవ్వలేకపోతున్నారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం విశాఖ రైల్వేజోన్, జాతీయ విద్యా సంస్థలను పూర్తిస్థాయిలో ఏర్పాటుచేయించేలా ఒత్తిడి తెస్తామని చెప్పలేకపోతున్నారు.

మూతపడ్డ మూడు సుగర్ ఫ్యాక్టరీలను ఆధునీకరించి తెరిపిస్తామని భరోసా ఇవ్వలేకపోతున్నారు. పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు ఇచ్చేలా బాధ్యతపడతామని అనడంలేదు.

ప్రధాన పార్టీల అభ్యర్థులకు సీట్లు కేటాయింపు పూర్తవడంతో గెలుపు వ్యూహాలే తప్ప అభివృద్ధి వ్యూహాలు వారిలో కన్పించడంలేదు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, సొంతగనుల సాధన వచ్చే ఎన్నికల్లో ప్రధాన అజెండా కావాలి. ప్రజలు అలా ఒత్తిడి చేయాలి. డబ్బు, కులాల బలాలతో పదవులు పొందాలన్న వంచితులను ఇంటికి పంపించి, ప్రజాహితం కోసం పనిచేసే అభ్యర్థులను చట్టసభలకు పంపించాలి.

ఉద్యోగుల సమస్యలపై ఐక్య పోరాటాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం జరిగే పోరాటంలో అన్ని సంఘాలూ ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎపి ఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కెవి.శివారెడ్డి పిలుపునిచ్చారు. ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గంలో నూతన అధ్యక్షునిగా శివారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చౌదరి పురుషోత్తమ నాయుడు ఎన్నికై నగరానికి వచ్చిన సందర్భంగా వారిని అభినందించే కార్యక్రమం శనివారం జిల్లా పరిషత్ అసెంబ్లీ హాల్లో జరిగింది. ఈ సందర్భంగా వారిని అసోసియేషన్ జిల్లా నాయకులు పెద్ద ఎత్తున సత్కరించి జ్ఞాపికను అందజేశారు. సమావేశంలో విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవిశంకర్, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.కృష్ణమూర్తి, పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్.సత్తిబాబు, ఎయు నాన్ టీచింగ్ స్టాఫ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జి.రవికుమార్, వై.నారాయణరావు, వివివి.సత్యనారాయణ పాల్గొన్నారు.

స్క్రాప్ అమ్మకాల్లో వాల్తేరు డివిజన్ రికార్డు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్ స్క్రాప్ అమ్మకాల్లో రికార్డు సృష్టించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో డివిజన్ రూ.161.53 కోట్లు విలువైన స్క్రాప్ అమ్మకాలు సాగించింది. గత ఏడాది ఆర్జించిన రూ.94.42 కోట్లతో పోలిస్తే ఇది 71.5 శాతం అధికం. ఈ సందర్భంగా వాల్తేరు డిఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ రికార్డు సాధనకు కారణమైన మెటీరియల్ మేనేజ్‌మెంట్, సివిల్ ఇంజినీరింగ్, మెకానికల్, క్యారేజ్ అండ్ వ్యాగన్, లోకో షెడ్స్, ఫైనాన్స్ విభాగాల సిబ్బందిని అభినందించారు.

గాయత్రిలో అస్త్రా సమావేశాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రాంగణంలో జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ స్టూడెంట్స్ మీట్ అస్త్రా సమావేశాలు శనివారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా ఇసాయి ఫార్మాస్యూటికల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అండ్ హెడ్ ఆఫ్ సైట్ లోకేషన్ డాక్టర్ గిరీష్ దీక్షిత్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మాస్యూటికల్ పరిశ్రమ గతిశీలత విజయానికి కీలకమైన నిర్వహణ వ్యూహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గాయత్రీ విద్యా పరిషత్ సభ్యులు ప్రొఫెసర్ పి.వి.శర్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రజిని, ఎంబిఎ విభాగ హెచ్‌ఒడి డాక్టర్ కెఎస్.బోస్, కో కన్వీనర్లు టిబిపి హెచ్‌ఒడి పి.వి.మోహిని, ఎంహెచ్‌ఆర్‌ఎం హెచ్‌ఒడి ప్రొఫెసర్ ఎవి.జోగారావు పాల్గొన్నారు.

ఘనంగా ఐఐఎం విశాఖ స్నాతకోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం (ఐఐఎం) ఎనిమిదో స్నాతకోత్సవం శనివారం సాయంత్రం బీచ్‌రోడ్‌లోని నొవాటెల్ హోటల్‌లో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా యాక్సిస్ బ్యాంక్ ఎమ్‌డి అండ్ సిఇఒ అమితాబ్ చౌదరి హాజరై ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలను, డిగ్రీ పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఐఐఎం డైరెక్టర్ ఎం.చంద్ర శేఖర్ మాట్లాడుతూ గడచిన ఎనిమిదేళ్లుగా సంస్థ సాధించిన విజయాలను వివరించారు. ఈ విద్య సంవత్సరంలో 301 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, ఇందులో పిజిపిలో 271, డిజిఎంలో 15 మంది ఉన్నారని తెలిపారు. ఇటీవలే తమ సంస్థ నూతన భవనంలో పూర్తిస్థాయిలో కార్యక్రమాలు ప్రారంభించిందని తెలిపారు. అమితాబ్ చౌదరి మాట్లాడుతూ ఐఐఎం వంటి ఉన్నత విద్యా సంస్థలలో విద్యను అభ్యసించిన వారు ఇప్పటికే దేశ విదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని తెలిపారు. భారతదేశ ఖ్యాతిని వ్యాపింపజేస్తున్నారన్నారు. అనంతరం అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బంగారు పతకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్మన్ హరి భాటియా, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులు వీరే

పిజిపి విభాగంలో మొదటి ర్యాంక్‌ను అంకిత్ శెట్టి, రెండో ర్యాంకును దుష్యంత్ గుప్తా, మహిళల విభాగంలో మొదటి ర్యాంకును స్తుతి సంఘీ సాధించారు. పిజిపిఈఎక్స్ విభాగంలో మొదటి ర్యాంకును గల్లా సత్య అప్పారావు, రెండో ర్యాంకును వడ్డాది అభిమన్యు సాధించారు. పిజిపిడిజిఎం విభాగంలో మొదటి ర్యాంకును సుశాంత్ కంద్వల్, రెండో ర్యాంకును లోకేష్ గుప్తా సాధించారు. ఆల్ రౌండ్ బెస్ట్ పెర్ఫార్మెన్స్‌గాను దుష్యంత్ గుప్తాకు గోల్డ్ మెడల్ లభించింది.

విద్యార్థికి పట్టా అందజేస్తున్న అమితాబ్ చౌదరి

శీతల పానీయాలకు డిమాండ్

ప్రజాశక్తి -తగరపువలస : వేసవిలో శీతల పానీయాలకు డిమాండ్ పెరుగుతుందనే చెప్పొచ్చు. స్థానికంగా ఏ పళ్ల దుకాణం వద్ద చూసినా జ్యూస్ తాగే వాళ్లు ఎక్కువ మంది కనిపిస్తున్నారు. తగరపువలసలో సుమారు 15 వరకు జ్యూస్ దుకాణాలు ఉన్నాయి. విశాఖ, విజయనగరం వెళ్లి ఏకమొత్తంగా బొప్పాయి, దానిమ్మ, ద్రాక్ష, కర్బూజ, క్యారెట్, కమలా, బత్తాయి, సపోటా, దానిమ్మ, కిస్‌మిస్ పళ్లు తెచ్చుకుంటామని పలువురు వ్యాపారులు తెలిపారు. ఏటా మాదిరిగానే పండ్ల ధరలు ఈ ఏడాది కూడా రెట్టింపు అయ్యాయని తెలిపారు. ఈ నేపథ్యంలోనే కొన్ని పళ్ల రసాలు ధరలు పెంచాల్సి వచ్చిందని వ్యాపారులు అంటున్నారు. బీట్ రూట్ రూ.40 నుంచి రూ.50కి పెంచామని తెలిపారు. వాటర్ మిలన్ జ్యూస్, బాదం మిల్క్, బనానా జ్యూస్, లస్సీ, ఆల్ మిక్సర్ జ్యూస్, మాంగో జ్యూస్ ధరలు రూ.30, కిస్‌మిస్, ఆపిల్ జ్యూస్‌లు రూ.40కి విక్రయిస్తున్నారు.

విరివిగా కొబ్బరి బొండాలు

మరో వైపు కొబ్బరి బొండాల అమ్మకాలు కూడా జోరుగా సాగుతున్నాయి. ఒక్కో బొండాం ధర రూ.25 నుంచి రూ.30కి అమ్ముతున్నారు. భీమిలి మండలం అమనాం, అన్నవరం, విజయనగరం జిల్లా తూడెం తదితర ప్రాంతాల్లో ఏక మొత్తంగా కొబ్బరి బొండాలు కొని తెచ్చి ఇక్కడ అమ్ముతున్నారు.

జోరుగా పుచ్చకాయల వ్యాపారం..

పుచ్చకాయల వ్యాపారం కూడా జోరందుకుంది. విజయనగరంలో ఏక మొత్తంగా కొని ఇక్కడకు తెచ్చి అమ్ముతుంటామని స్థానిక వ్యాపారులు తెలిపారు. ఒక్కో ముక్క రూ.10కి విక్రయిస్తున్నారు.

బాధ్యతగా పనిచేయండి : బొత్స

సమావేశంలో మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి -పద్మనాభం : ఎన్నికల్లో నాయకులందరూ బాధ్యతగా పనిచేయాలని గ్రామస్థాయి నాయకులకు, సర్పంచులకు, ఎంపిటిసి సభ్యులకు, కార్యకర్తలకు మంత్రి బొత్స సత్యనారాయణ సూచించారు. పద్మనాభంలోని మామిడితోటలో వైసిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి గ్రామంలోనూ అత్యధిక మెజార్టీ వచ్చేలా పనిచేయాలన్నారు. ఏ స్థాయిలో విభేదాలు ఉన్నా వాటిని సరి చేయడానికి ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేసినట్లు తెలిపారు. పేదలకు సంక్షేమం అందించిన ప్రభుత్వం వైసిపి అని పేర్కొన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, మండలం పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గిరిబాబు, ఎంపిపి రాంబాబు, మండల పార్టీ అధ్యక్షులు లక్ష్మణరావు, ఆదిబాబు, ఈశ్వరరావు, బంగారు అప్పుడు, అన్నమయ్య, పాపారావు, మామిడి శివ, పైడినాయుడు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భీమిలి ప్రజల ఆదరాభిమానాలు మరువలేనివి

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా

ప్రజాశక్తి -భీమునిపట్నం : తన పట్ల భీమిలి నియోజకవర్గ ప్రజలు ఎంతోకాలంగా చూపుతున్న ఆదరాభిమానాలు ఎన్నటికీ మర్చిపోలేనని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు అన్నారు. పార్టీ అధిష్టానం టిక్కెట్ ఖరారు చేయడంతో శనివారం ఆయన స్థానిక క్యాంప్ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తొలుత విజయనగరం జిల్లా, చీపురుపల్లిలో పోటీ చేయాలంటూ పార్టీ అధిష్టానం చెప్పినప్పటికీ తాను అక్కడికి వెళ్లేందుకు అంగీకరించలేదని, భీమిలిలో అవకాశం ఇవ్వాలని కోరగా, పార్టీ అధిష్టానం ఆలోచించి అవకాశం కల్పించిందని తెలిపారు. పార్టీ అధిష్టానం జరిపిన సర్వే ఫలితం తనకు అనుకూలంగా రావడంతో ఇక్కడ టికెట్ కేటాయించినట్లు పేర్కొన్నారు. తనను గెలిపిస్తే భీమిలి ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. మాజీ మంత్రి ఆర్‌ఎస్‌డిపి అప్పలనరసింహరాజు, కార్పొరేటర్లు గాడు చిన్నికుమారి లక్ష్మి, పివి నరసింహం, మాజీ ఎంపిపి యరబాల కృష్ణవేణి, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బోర రాధా కుమారి, పార్టీ పరిశీలకులు కొట్టి బాలాజీ, నాయకులు డిఎఎన్ రాజు, గంటా నూకరాజు, కాళ్ల నగేష్‌కుమార్, పాసి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు. ముందుగా పార్టీ శ్రేణులు గంటాను గజమాలతో స్వాగతం పలికారు.

సమావేశంలో మాట్లాడుతున్న గంటా శ్రీనివాసరావు

అంతర్జాతీయ గణిత సదస్సు ప్రారంభం

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర యూనివర్సిటీలోని గణిత శాస్త్ర విభాగంలో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ప్యూర్, అప్లైడ్ అండ్ ఇంజినీరింగ్ మ్యాథమెటికల్ సైన్సెస్ అంశంపై అంతర్జాతీయ సదస్సు శనివారం ప్రారంభమైంది. శని, ఆదివారాలు ఈ సదస్సు నిర్వహించనున్నారు. శనివారం ప్రారంభమైన సదస్సుకు డైరెక్టర్‌గా గణిత శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ పి అనురాధ కామేశ్వరి అధ్యక్షత వహించారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొఫెసర్ సిహెచ్ శ్రీనివాసరావు సదస్సు ఆవశ్యకతను, సదస్సులో పాల్గొనే వక్తలు గురించి వివరించారు. ఉత్తరాంధ్ర మ్యాథమెటికల్ సైన్సెస్ చైర్మన్ ప్రొఫెసర్ కెపిఆర్ శాస్త్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇలాంటి సదస్సులు యువ పరిశోధకులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఉత్తరాంధ్ర మ్యాథమెటికల్ సైన్సెస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కేకేఎం శర్మ గౌరవ అతిథులుగా హాజరై గణితం గొప్పతనాన్ని తెలియజేశారు. ఐఐటి ఖరగ్‌పూర్ ఆచార్యులు ప్రొఫెసర్ జిపి రాజశేఖర్ మాట్లాడుతూ గణిత శాస్త్ర అనువర్తనాలపై పరిశోధన చేయడం వల్ల యూనివర్సిటీకి తద్వారా దేశానికి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఉత్తరాంధ్ర సొసైటీ ఫర్ మ్యాథమెటికల్ సైన్సెస్, ప్రొఫెసర్ ఎస్ మీనాక్షి సుందరం మెమోరియల్ సొసైటీ, ఆంధ్ర విశ్వవిద్యాలయం గణిత శాస్త్ర విభాగము సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సదస్సులో గణిత శాస్త్ర ఆచార్యులు ప్రొఫెసర్ పిడిఎన్ శ్రీనివాసు, ప్రొఫెసర్ జి.నానాజీరావు, ప్రొఫెసర్ ఎస్.రవికుమార్, ప్రొఫెసర్ ఎన్.రామకృష్ణ, విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ కెవిఎల్ఎన్ స్వామి, ప్రొఫెసర్ జిసి రావు, ప్రొఫెసర్ ఎన్‌వివిఎస్.మూర్తి హాజరయ్యారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో అవస్థలు

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 10వ వార్డు పరిధిలో తరచూ అప్రకటిత విద్యుత్ కోతలతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. సాయంత్రం వేళల్లో రోజూ ఏదో ఒక ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. రెండు రోజుల క్రితం రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో చిన్నారులు, రోగులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అసలే వేసవి, ఎండలు తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఉక్కపోత, వీటికి తోడు దోమలు బెడదతో కంటి మీద కునుకు లేకుండా అవస్థలు పడ్డారు. తరచూ ఈ సమస్య ఉండడంతో స్థానికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. మేడ మీద పడుకుందామంటే దొంగలు భయంతో ఆందోళన చెందుతున్నారు. మార్చి నెలలోనే ఇలా ఇద్యుత్ కోతలు ముందు నెలల్లో ఎటువంటి ఇబ్బందులు పడాల్సి వస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

నేడు 'మన పోలింగ్ బూత్ - మన ఓటు'

ప్రజాశక్తి -భీమునిపట్నం : నియోజకవర్గంలో మే 13న జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించు కోవడం ద్వారా ఓటింగ్ శాతం పెంపుదలకు గాను నేడు "మన పోలింగ్ బూత్ - మన ఓటు" పేరిట అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, స్థానిక ఆర్‌డిఒ ఎస్.భాస్కరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బిఎల్ఒలు, సూపర్‌వైజర్లు పాల్గొని ఓటు నమోదు సంఖ్య, పోలింగ్ కేంద్రం చిరునామా తెలియజేస్తారని తెలిపారు. ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఆత్మస్థైర్యంతో సాగితే విజయం సాకారం

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆత్మస్థైర్యంతో యువత ముందుకు సాగితే విజయం సాకారమవుతుందని ఏయూ వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి అన్నారు. ఏయూ టిఎల్ఎన్ సభామందిరంలో జర్నలిజం విభాగం ఆధ్వర్యాన డిప్లమా ఇన్ ఫొటోగ్రఫీ కోర్సును పూర్తిచేస్తున్న విద్యార్థుల ఫొటోగ్రఫీ ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ, ఆసక్తికి అనుగుణంగా నేటితరం యువత ముందుకు సాగుతున్నారన్నారు. ఫొటోగ్రఫీలో మెళకువలు నేర్చుకుని, ఒక వృత్తిగా ఎంపిక చేసుకుని ముందుకుసాగడం ఎంతో మంచి పరిణామమన్నారు.

నేరాలు ఘోరాలు

పెళ్లి కూతురు మెడలో బంగారం చోరీ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని ములకలాపల్లి గ్రామంలో భారీ దొంగతనం చోటుచేసుకుంది. కొత్త పెళ్లి కూతురు మెడలో నుండి సుమారు ఏడున్నర తులాల బంగారాన్ని అపహరించుకుపోయినట్లు ఆమె భర్త మజ్జి సతీష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... ములకలాపల్లి గ్రామానికి చెందిన మజ్జి సతీష్‌కు ఇటీవలే వివాహమైంది. శు క్రవారం రాత్రి సమయంలో ఇంట్లో వారంతా బయట పడుకోగా, కొంత జంట ఇంట్లో పడుకున్నారు. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తి నిద్రిస్తున్న కొత్త పెళ్లికూతురు మెడలో ఉన్న బంగారాన్ని తెంపి పట్టుకొని పారిపోయాడు. ఈ మేరకు సతీష్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాలుగు తులాల గొలుసు, మూడున్నర తులాల తాడు, చతమానం అపహరించినట్లు ఆ పిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.నాగేంద్ర తెలిపారు.

80 లీటర్ల నాటుసారా స్వాధీనం - ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల కేంద్రానికి సమీపంలో ఉన్న జీనబాడు గ్రామానికి చెందిన గాలి శ్రీనివాసులు, గురేపల్లి రాంబాబు 80 లీటర్ల నాటుసారాతో దేవరాపల్లి శారదా నది వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. వారి వద్ద నుండి 80 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని, ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ డి.నాగేంద్ర శనివారం తెలిపారు. నాటుసారా వంటకాలకు, అమ్మకాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

నేరెళ్లవలస పంచాయతీలో ప్రచారం చేస్తున్న ముత్తంశెట్టి

ముత్తంశెట్టి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని చిన్నాపురం, నేరెళ్లవలస పంచాయతీలో శనివారం ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు నిర్వహించారు. నేరెళ్లవలస పంచాయతీ పరిధిలోని విజయానందపురం, నేరెళ్లవలస, కొయ్యిపేట, చిన్నాపురం గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేపట్టారు. అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి సభ్యులు గిరిబాబు, మండల పార్టీ అధ్యక్షులు లక్ష్మణరావు, బంగారు అప్పుడు, కొయ్య సత్యనారాయణ, కోన రమణ తదితరులు పాల్గొన్నారు.

గంటాకు టికెట్‌పై రాజాబాబు అసంతృప్తి

ప్రజాశక్తి -ఆనందపురం : భీమిలి నియోజకవర్గం అసెంబ్లీ టికెట్‌ను గంటా శ్రీనివాసరావు తెలుగుదేశం పార్టీ ప్రకటించడంతో నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజాబాబు అసంతృప్తి వ్యక్తంచేశారు. ఆనందపురం జంక్షన్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నాలుగున్నర సంవత్సరాల నుంచి నిర్విరామంగా పార్టీ కోసం కష్టపడుతూ వస్తున్నానని, ఇన్చార్జిలే ఎమ్మెల్యే అభ్యర్థులని అప్పట్లో చంద్రబాబు చెప్పారని తెలిపారు. తనను అన్ని విధాలా సిద్ధంగా ఉండాలని చంద్రబాబు చెప్పారని, అన్ని సమకూర్చుకొని సిద్ధంగా ఉండేసరికి అధిష్టానం కనీసం తనతో సంప్రదించకుండా భీమిలి అసెంబ్లీ టికెట్‌ను గంటా శ్రీనివాసరావుకు కేటాయించారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ నాలుగున్నరేళ్లలో కనీసం నియోజకవర్గంలో కనిపించని వ్యక్తికి టికెట్ ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. స్థానికులకు తీవ్ర అన్యాయం జరిగిందని, అధిష్టానం పునరాలోచించాలని కోరారు.

పాలిసెట్‌పై ఉచిత శిక్షణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశానికి నిర్వహించే పాలిసెట్ పరీక్షకు హాజరుకానున్న విద్యార్థులకు ఏప్రిల్ 1 నుంచి 24వ తేదీ వరకు తమ కళాశాలలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ మురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాసేందుకు అర్హులని పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిక్షణా తరగతులు జరుగుతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రవేశ పరీక్ష కు సంబంధించిన మెటీరియల్‌ను ఉచితంగా అందజేస్తామని తెలిపారు.

ఐపిఎల్ మ్యాచ్‌తో నేడు ట్రాఫిక్ ఆంక్షలు

ప్రజాశక్తి-మధురవాడ : పోతిన మల్లయ్యపాలెంలోని క్రికెట్ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్, చెన్నై సూపర్ కింగ్స్ ఐపిఎల్ టి-20 క్రికెట్ మ్యాచ్ నేపథ్యంలో ఆదివారం పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. మ్యాచ్ రాత్రి 7 నుంచి 11.30 గంటల వరకు జరుగనున్న నేపథ్యంలో మ్యాచ్‌తో సంబంధంలేని వాహనదారులు మధురవాడ క్రికెట్ స్టేడియం వైపు ప్రయాణించకుండా వేరే మార్గాలలో ప్రయాణించాలని సూచించారు. శ్రీకాకుళం, విజయనగరం, ఆనందపురం వైపు నుంచి వచ్చే బస్సులు, ఇతర కమర్షియల్ వాహనాలు మారికవలస వద్ద ఎడమవైపు తిరిగి జురాంగ్ జంక్షన్ మీదుగా తిమ్మాపురం చేరి కుడివైపు బీచ్ రోడ్డు గుండా ప్రయాణించి రుషికొండ, సాగర్ నగర్, జోడుగుళ్లపాలెం మీదుగా ప్రయాణించాలని తెలిపారు.

శ్రీకాకుళం, విజయనగరం, ఆనందపురం వైపు నుండి వచ్చే కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు కార్ షెడ్డు ముందు మిధులాపురి కాలనీ మీదుగా ఎంవిపి సిటీ వెనుకగా వెళ్లి, లా కాలేజీ రోడ్డు మీదగా జాతీయ రహదారికి చేరుకొని నగరంలోకి వెళ్లాలని పేర్కొన్నారు. లా కాలేజ్ రోడ్డు నుంచి పనోరమ హిల్స్, రుషికొండ మీదుగా నగరంలోకి వెళ్లవచ్చని ప్రకటించారు.

విశాఖపట్నం నుంచి ఆనందపురం, విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లు బస్సులు, ఇతర కమర్షియల్ వాహనాలు హనుమంతవాక నుంచి ఎడమవైపు తిరిగి ఆరిలోవ బిఆర్‌టిఎస్ రోడ్డులో వెళ్లి అడవివరం వద్ద కుడివైపు తిరిగి ఆనందపురం మీదుగా వెళ్లాలని, కార్లు, ద్విచక్ర వాహనాలు ఆటోలు అడవివరం మీదుగా ఆనందపురం లేదా హనుమంతవాక జంక్షన్, విశాఖ వ్యాలీ జంక్షన్, ఎండాడ జంక్షన్ వద్ద కుడివైపు తిరిగి బీచ్ రోడ్ గుండా వెళ్లి తిమ్మాపురం వద్ద ఎడమవైపు తిరిగి మారికవలస వద్ద జాతీయ రహదారికి చేరుకొని వెళ్లవచ్చని తెలిపారు.

క్రికెట్ మ్యాచ్ చూడడానికి వాహనదారులు విశాఖపట్నం నగరం నుంచి స్టేడియానికి వచ్చే వివిఐపిలు, విఐపి వాహనదారులు స్టేడియం వరకు ప్రయాణించి ఎ, బి గ్రౌండ్‌లు, వి కన్వెన్షన్ గ్రౌండ్లలో వారి పాసు ప్రకారం చేరుకోవాలని పేర్కొన్నారు. ఇతర టికెట్ హోల్డర్స్ స్టేడియం వద్ద గల ఓల్డ్‌ఏజ్ హోం జంక్షన్ వద్ద ఎడమవైపు తిరిగి సాంకేతిక ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్లో పార్కింగ్ చేసుకోవాలని తెలిపారు.

శ్రీకాకుళం, విజయనగరం, ఆనందపురం, గంభీరం, బోయపాలెం, కొమ్మాది వైపు నుంచి వచ్చువారు కార్ షెడ్ జంక్షన్ వద్ద కుడివైపు తిరిగి సాంకేతిక కాలేజ్ పార్కింగ్ గ్రౌండ్‌లో లేదా కార్ షెడ్ జంక్షన్ ముందు పెప్సీ కటింగ్ నుంచి ఎడమవైపు తిరిగి మిధులాపురి కాలనీ మీదుగా వచ్చి ఎంవిపి సిటీ డబల్ రోడ్డు, పోలిశెట్టి వేణుగోపాలరావు గ్రౌండ్ లో పార్కింగ్ చేయాలని పేర్కొన్నారు.

విశాఖపట్నం నగరం, లేదా భీమిలివైపు నుంచి బీచ్ రోడ్డు మీదగా స్టేడియానికి వచ్చు వారు ఐటి సెజ్ మీదుగా వచ్చి ఎంవిపి సిటీ డబల్ రోడ్డులో పార్కింగ్ చేసుకోవాలని తెలిపారు. విశాఖ నగరం నుంచి వచ్చే ఆర్‌టిసి స్పెషల్ బస్సులు జాతీయ రహదారిలో రాకుండా బీచ్ రోడ్డులో వచ్చి ఐటి సెజ్ మీదుగా లా కాలేజ్ రోడ్డులో పార్కింగ్ చేయాలని పేర్కొన్నారు.

శ్రీకాకుళం, విజయనగరం, ఆనందపురం వైపు నుండి వచ్చే ఆర్‌టిసి స్పెషల్ బస్సులు మారికవలస వద్ద ఎడమవైపు తిరిగి తిమ్మాపురం రోడ్డు మీదుగా వచ్చి జురాంగ్ జంక్షన్ వద్ద కుడివైపుకు తిరిగి లా కాలేజ్ వద్దకు చేరుకుని పార్కింగ్ చేయాలని వివరించారు.

పత్రికా విలేకర్ల వాహనాలను వారికి కేటాయించిన గెట్ నెంబర్ 10, 11 (శ్రీ వెంకటేశ్వర స్వామి గుడి వద్ద) పార్కింగ్‌కు కార్ షెడ్ మీదుగా చేరుకోవాలని తెలిపారు. మ్యాచ్ అనంతరం సాంకేతిక కాలేజ్ పార్కింగ్ గ్రౌండ్‌లో పార్కింగ్ చేసుకున్న వాహన దారులు తిరిగి వెళ్లేటప్పుడు విజేత సూపర్ మార్కెట్, కార్ షెడ్ మీదుగా ప్రయాణించాలని నగర ట్రాఫిక్ పోలీసులు ప్రకటించారు.

మద్దతు కూడగట్టే పనిలో గుంటూరు

ప్రజాశక్తి-పెందుర్తి: పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీచేస్తున్న విశాఖ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, ఏపీ గిడ్డంగుల శాఖ మాజీ డైరెక్టర్ గుంటూరు వెంకట నరసింహారావు ప్రముఖుల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. నగరంలో రాజకీయంగా, సామాజికంగా, వృత్తిపరంగా పలుకుబడి గల ప్రముఖులను కలిసి వచ్చే ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం పెందుర్తి మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులును కలిసి మద్దతు కోరారు. రాజకీయంగా తన లక్ష్యాన్ని, పెందుర్తి అభివృద్ధికి తాను చేపట్ట బోయే పనులను ఆయనకు వివరించారు. దీనిపై ఆంజనేయులు సానుకూలంగా స్పందించినట్లు నరసింహారావు మీడియాకు తెలియజేశారు. ప్రముఖ వైద్య నిపుణుడు, పద్మశ్రీ ఆదినారాయణరావును కలిసి వచ్చే ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధే లక్ష్యంగా తన రాజకీయం కొనసాగుతుందని స్పష్టం చేశారు. దీనికోసం నాయకులు, మేధావులు, నిపుణులను కలిసి మద్దతు కోరుతానని వెల్లడించారు.

49వ వార్డులో సమావేశం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 49వ వార్డు పరిధి ఎన్జీజీవోస్ కాలనీ బాలాజీ ఫంక్షన్ హాల్‌లో కార్పొరేటర్ అల్లు శంకరరావు ఆధ్వర్యాన వైసిపి శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె రాజు హాజరై పార్టీ శ్రేణులనుద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, బాణాల శ్రీనివాసరావు, లంక భాస్కర్, నాయకులు ఎన్.రవికుమార్, ఐ.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.



52వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న జియ్యాని శ్రీధర్

52వ వార్డులో ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి 52వ వార్డు పరిధి అంబేద్కర్‌నగర్‌లో పశ్చిమ నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ తరుపున డిప్యూటీ మేయర్ జియ్యని శ్రీధర్ శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ, ఆనంద్‌కుమార్ సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టిన నుంచి నియోజకవర్గంలో సొంత నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్.కృష్ణ, జియ్యాని మారుతీ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏయూ విద్యార్థులకు మెరుగైన ఉపాధి : వీసీ

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభించడం పట్ల ఏయూ వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఇటీవల ఏయూ సౌత్ క్యాంపస్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఇన్ ఎడ్యుకేషన్ (ఐఎఎస్ఇ)లో బిఇడి, ఎంఇడి చదువుతున్న విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఓక్‌రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్, శ్రీ విశ్వ జూనియర్ కళాశాల, రిషి డిగ్రీ కళాశాల, భాష్యం ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్, నారాయణ విద్య సంస్థలు నిర్వహించిన ఈ నియామక ప్రక్రియకు 200 మంది విద్యార్థులు హాజరవగా 170 మంది విద్యార్థులు ఎంపికై రికార్డు సృష్టించారు. వీరికి అత్యధిక వేతనంగా రూ.6.25 లక్షలు లభించడం పట్ల వీసీ సంతోషం వ్యక్తం చేశారు. తన కార్యాలయంలో విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఐఎఎస్ఇ ప్రిన్సిపల్ ఆచార్య టి.శోభశ్రీ, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ విజర్ రెడ్డి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైన్స్ టెక్నాలజీ, ఆర్ట్స్-కామర్స్, ఫార్మసీ, న్యాయ కళాశాలల పరిధిలో 190 సంస్థలు సందర్శించగా 850 మంది విద్యార్థులకు ఉపాధి అవకాశాలు లభించాయని వీసీ తెలిపారు. సైన్స్‌కోర్సుల వారికి అత్యధికంగా రూ.13 లక్షలు, ఆర్ట్స్ కోర్సుల వారికి రూ.7.8 లక్షలు, ఫార్మసీ వారికి రూ.6 లక్షలు, న్యాయ విద్యార్థులకు రూ.4.5 లక్షలు వేతనంగా సాధించారని పేర్కొన్నారు.

60వ వార్డులో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి -ములగాడ: జివిఎంసి 60వ వార్డు పరిధి ఇందిరాకాలనీ, అశోక్‌నగర్ తదితర ప్రాంతాలలో కార్పొరేటర్ పీవీ సురేష్, వైసిపి నగర ప్రధాన కార్యదర్శి సరగడం పత్రిరావు ఆధ్వర్యాన ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ సోదరి ఎలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్ల రమా కుమారి ప్రచారం నిర్వహించారు. అశోక్‌నగర్‌లో గడపగడపకు తిరుగుతూ ప్రజల యోగక్షేమాలనడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల హామీలను శతశాతం నెరవేర్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగ రాంప్రసాద్, మల్ల ధనలత, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న రమాకుమారి

కెకె.రాజును కలిసిన న్యాయవాదులు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో కెకెరాజును పలువురు న్యాయవాదులు కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ, న్యాయవాదుల సంక్షేమానికి వైసిపి కట్టుబడి ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో కెకె.రాజు గెలుపునకు సహకరిస్తామని న్యాయవాదులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కెవిఎన్ శశికళ, సేనాపతి అప్పారావు, న్యాయవాదులు జీఎం రెడ్డి, బాజీనాయుడు, ఆర్ఎస్.రవి, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఎన్నికల కార్యాలయాలు ప్రారంభం

వైసిపి ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కె.కె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార, గాజువాక : జివిఎంసి 45వ వార్డు కార్పొరేటర్ కంపా హనుక్, 55వ వార్డు కార్పొరేటర్ కెవిఎన్ శశికళ ఆధ్వర్యాన తాటిచెట్లపాలెం 80 అడుగుల రహదారి వద్ద ఏర్పాటుచేసిన వైసిపి ఎన్నికల కార్యాలయాన్ని ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు శనివారం ప్రారంభించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం 45, 55 వార్డుల పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వార్డు స్థాయిలో పార్టీ కేడర్‌ను బలోపేతం చేయాలన్నారు. 2014లో విజయం సాధించిన విష్ణు కుమార్‌రాజు ప్రజల సమస్యలను గాలికి వదిలేసి 2019లో ఓటమి చవిచూసి కనుమరుగయ్యారన్నారు. గడిచిన ఐదేళ్లలో ప్రజల్లో కనిపించని విష్ణుకుమార్ రాజు ప్రస్తుతం ఎన్నికలను పురస్కరించుకొని ప్రజలపై దొంగ ప్రేమ ఒలకబోస్తున్నారని విమర్శించారు. ఉమ్మడి పార్టీల దత్తపుత్రుడిగా విష్ణుకుమార్ రాజు నిలుస్తారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, బాణాల శ్రీనివాసరావు, జివిఎంసి డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు సారిపల్లి గోవిందు, ఆళ్ల లీలావతి, ఉషశ్రీ, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, భర్మత్‌అలీ, కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

14వ వార్డులో...

14వార్డు పరిధి పోర్టు స్టేడియం ఈస్ట్ గేట్ దగ్గర కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన వార్డు ఎన్నికల కార్యాలయాన్ని కెకె.రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక ప్రజల సమస్యలు తెలుసుకొని వారితో మమేకం కావాలన్నారు. నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని చెప్పారు. అనంతరం 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్ కుమార్ రాజు, కార్యకర్తలతో కలిసి వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేరిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

26వ వార్డులో...

జివిఎంసి 26వ వార్డులో వైసిపి నూతన కార్యాలయాన్ని కెకె.రాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బాణాల శ్రీనివాసరావు, వార్డు వైసిపి అధ్యక్షులు షీలా వెంకటలక్ష్మి, నాయకులు బుడ్డి కిరణ్‌కుమార్, కొనకల రేవతిరావు, బులుసు జగదీశ్వర్‌రావు, శేషు, పాండవ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గాజువాకలో

గాజువాక : స్థానిక చెట్టివానిపాలెంలో ఏర్పాటుచేసిన గాజువాక అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి ఎన్నికల ప్రధాన కార్యాలయాన్ని పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి చాలామంది వైసిపిలో చేరుతున్నారన్నారు. అమర్‌నాథ్ విజయం సాధిస్తే గాజువాకలో మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, గాజువాక మున్సిపాల్టీ మాజీ చైర్మన్ రాజా, నాయకులు ఉరుకూటి అప్పారావు, తిప్పల దేవన్‌రెడ్డి, వంశీరెడ్డి, ఉరుకూటి రామచంద్రరావు, మంత్రి రాజశేఖర్, దామా సుబ్బారావు, రొంగలి జగన్నాథం, రెడ్డి జగన్నాథం, పల్లా చినతల్లి, భోగాది సన్నీ, ఇమ్రాన్, రజనా రామారావు, లక్కి, ప్రకాశ రావు తదితరులు పాల్గొన్నారు.

గాజువాకలో వైసిపి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న వైవి సుబ్బారెడ్డి

ఉత్తరాంధ్రకు తీవ్ర అన్యాయం చేసిన బిజెపి ఎంపీ అభ్యర్థి సిఎం.రమేష్‌ను ఓడించండి

సిపిఎం మండల కన్వీనర్ శ్రీరామ్

ప్రజాశక్తి -అనకాపల్లి

ఉత్తరాంధ్రకు తీవ్ర అన్యాయం చేసిన బిజెపి అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సిఎం రమేష్‌ను చిత్తుగా ఓడించాలని సిపిఎం అనకాపల్లి మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ ఓటర్లకు పిలుపునిచ్చారు. అనకాపల్లి సిపిఎం కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అక్రమంగా అమ్మకానికి పూనుకొని బిజెపి ఈ ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. విశాఖ రైల్వే జోన్ ఇవ్వలేదని, ఉత్తరాంధ్ర అభివృద్ధి నిధులను నిలుపుదల చేసిందని పేర్కొన్నారు. పోలవరం నిర్మాణం, ఏపికి ప్రత్యేక హోదాను ఇవ్వకుండా బిజెపి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఇటువంటి సమస్యల పైన రాజ్యసభ సభ్యులుగా ఉన్న సీఎం రమేష్ ఏ రోజూ రాజ్యసభలో మాట్లాడలేదని తెలిపారు. పైగా ఫోర్జరీ సంతకాలతో 450 కోట్లు రూపాయలను బ్యాంకుల నుండి దోపిడీ చేశారన్నారు. ఇటువంటి దొంగలను గెలిపించినట్లయితే ఉత్తరాంధ్రను దోచకొని తన సొంత ప్రయోజనాల కోసం ఉపయోగించుకునే అవకాశం ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి బిజెపి అభ్యర్థి సీఎం రమేష్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండలం కమిటీ సభ్యులు కాళ్ళ తేలయ్యబాబు, బి.ఉమామహేశ్వరరావు, బుగిడి నూకప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గంటా శ్రీరామ్

వైసిపి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల ప్రచారం

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి పార్లమెంట్, శాసనసభ నియోజకవర్గాల వైసిపి అభ్యర్థులు బూడి ముత్యాల నాయుడు, మలసాల భరత్ కుమార్, అనకాపల్లి ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి శనివారం జీవీఎంసీ అనకాపల్లి జోన్ 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీ సౌజన్య రాంబాబు ఆధ్వర్యంలో శనివారం దాసరిగడ్డ రోడ్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు గురించి వివరించారు. రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి ఎంపీ, ఎమ్మెల్యేలుగా తమను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొణతాల నీలిమ భాస్కరరావు, వైసిపి నాయకులు ఆళ్ల నాగేశ్వరరావు, మల్ల బుల్లిబాబు, భీశెట్టి జగన్, జడ్పిటిసిలు, ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, 81వ వార్డు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికి ఘనంగా సత్కరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చర్చ్ ఆఫ్ క్రైస్ట్‌లో..

గుడ్ ఫ్రైడే సందర్భంగా స్థానిక రాజీవ్ ఇండోర్ స్టేడియం సమీపంలో చర్చ్ ఆఫ్ క్రైస్ట్‌ను వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ సందర్శించారు. చర్చ్ పాస్టర్ పండ్రాన తిమోతి ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో సంఘ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో గంగుపాము నాగేశ్వరరావు, బొడ్డేడ శివ, ఆళ్ల నాగేశ్వరరావు, మణి, రామారావు, పైడికొండ, శంకరరావు, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

సినీ నటుడు సుమన్‌ను కలిసిన భరత్ కుమార్

క్రశింకోట : కశింకోట మండలం తాళ్ళపాలెం రన్ వే హోటల్‌లో సినీ నటుడు సుమన్‌ను అనకాపల్లి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రైవేట్ కార్యక్రమం కోసం సుమన్ హోటల్‌కు వచ్చారు. ఆయన వెంట ఎంపీపీ కలగ లక్ష్మీ గున్నయ్యనాయుడు, వైసిపి నాయకులు మలసాల కిషోర్ ఉన్నారు.

టిడిపిలో చేరిన గొందుపాలెం సర్పంచ్

ప్రజాశక్తి- కె.కోటపాడు : వైసిపికి చెందిన మండలంలోని గొందుపాలెం గ్రామ సర్పంచ్ బండారు లక్ష్మణరావు, ఏడుగురు వార్డు మెంబర్లు, మాజీ ఉప సర్పంచ్, మరో ఏడుగురు వైసిపి కార్యకర్తలు శనివారం మాడుగుల నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు సమక్షంలో టిడిపిలో చేరారు. వారికి పైలా కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పైలా మాట్లాడుతూ టిడిపితోనే మాడుగుల నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రొంగలి మహేష్, లెక్కల మల్లేశ్వరరావు, రామునాయుడు, బండారు వెంకన్న పాత్రుడు (చిన్నదొర), బిజెపి, జనసేన నాయకులు మేడపురెడ్డి శ్రీనివాసరావు, కోటాన ఈశ్వరరావు, బాలిబోయిన సంతోష్, లెక్కల అవతారమూర్తి, బండారు ముత్యాపాత్రుడు, నాగిరెడ్డి అన్నంనాయుడు, జాగరపు దేముడు నాయుడు, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇద్దరు వలస కూలీలు అదృశ్యం

పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు

ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్న

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని చింతలపూడి, గర్సింగి పంచాయతీలకు చెందిన ఇద్దరు వలస కూలీలు కూలి పనులకు వెళ్లి అదృశ్యమయ్యారని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏటా ఫిబ్రవరి, మార్చి నెలల్లో గుడివాడ, ఏలూరు, మచిలీపట్నం తదితర ప్రాంతాలకు గిరిజన యువకులు మిరప చేలు పనులకు వెళ్తుంటారని పేర్కొన్నారు. ఆ విధంగానే ఈ ఏడాది దేవరాపల్లి మండలం చింతలపూడి పంచాయతీ శివారు వీరభద్రపేటకు చెందిన తామర్ల కొండబాబు (20), గర్సింగి పంచాయతీ శివారు ఎలాంబైలకు చెందిన బొర్రబోయిన అప్పారావు (20) ఇద్దరు 20 రోజుల క్రితం వేర్వేరు ప్రాంతాలకు పనులకు వెళ్లారని తెలిపారు. తిరిగి వచ్చే క్రమంలో అనకాపల్లిలో ఒకరు, భీమవరంలో ఒక్కరు కనిపించకుండా పోయినట్లు కుటుంబీకులు చెప్పారని పేర్కొన్నారు. వారి ఆచూకీ కోసం అనకాపల్లి, భీమవరం పోలీసు స్టేషన్లలో తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అయినా ఎటువంటి ప్రయోజనం లేదని, వారి కోసం తల్లి దండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనిపించకుండా పోయిన వారు గిరిజనులు కావడంతో అధికారులు కూడా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏటా వలస వెళ్లే వారిలో కొంత మంది కనిపించకుండా పోతున్నారని, ఈ యువకులు కనిపించకుండా పోవడం వెనుక ఏదో కుట్ర ఉందని తెలిపారు. దీనిపై పోలీసులు విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని, సరైన నిఘాను ఏర్పాటు చేసి మాయమైపోయిన యువకులు ఆచూకీ తెలుసుకోవాలని పోలీసు, జిల్లా అధికారులకు వెంకన్న విజ్ఞప్తి చేశారు.

అదృశ్యమైన కొండబాబు, అప్పారావు

సహిత విద్యా కార్యక్రమాలపై అవగాహన

ప్రజాశక్తి -అనకాపల్లి : స్థానిక అనకాపల్లి జివిఎంసి టౌన్ గర్ల్స్ హైస్కూల్లో శనివారం జిల్లాలోని హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, భవిత సెంటర్లు ఉన్న స్కూల్ ప్రధానోపాధ్యాయులు, సిడిపివోలు, అంగన్వాడీ సూపర్‌వైజర్లకు పాఠశాల స్థాయిలో సహిత విద్య కార్యకలాపాలపై జిల్లాస్థాయి ఒక రోజు ఓరియంటేషన్ ప్రోగ్రామ్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం. వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక ఉపాధ్యాయుల సహకారంతో ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి చైల్డ్ ఇన్ఫో, యు.డైస్ ప్లస్‌లో తప్పనిసరిగా అప్డేట్ చేయాలన్నారు. తద్వారా వారికి కల్పించబడిన అన్ని రకముల సేవలు, సదుపాయాలు (అన్ని రకాల అలవెన్స్‌లు, ఉపకరణములు, స్కాలర్‌షిప్లు మొదలగు) అందజేయడం జరుగుతుందన్నారు. వికలాంగ పిల్లలు ఎలాంటి వివక్ష ఎదుర్కోకుండా ఇతర పిల్లలతో సమానంగా చదువుకునేలా చేసేందుకు పాఠశాల స్థాయిలో 'సహిత విద్య'ను సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహిత విద్య సమన్వయ అధికారిణి బి.శకుంతల, జిల్లా విద్యాశాఖ ఏ.పి.వో వెంకటేశ్వరరావు, జిల్లా రిసోర్స్ పర్సన్లు బొడ్డు మహలక్ష్మి నాయుడు, దేముడు బాబు, బి.వి.వరప్రసాద్, ప్రత్యేక ఉపాధ్యాయులు జగన్నాథ నాయుడు, దేవుడు నాయుడు పాల్గొన్నారు.

ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు విద్యార్థులకు ఉచితంగా ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ బివిఎస్ఎస్ శ్రీనివాసరావు తెలిపారు. ఏప్రిల్ 27న జరగనున్న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకొని విద్యార్థులు ఏప్రిల్ 5వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ ఒకటి నుంచి జరిగే ఉచిత శిక్షణ తరగతులు ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉంటాయని చెప్పారు. విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్‌తో పాటు అనుభవజ్ఞులైన అధ్యాపకులచే శిక్షణ, మోడల్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు హెల్ప్ లైన్ సెంటర్ లేదా polycetap.nic.in వెబ్ సైట్‌ను సందర్శించాలన్నారు.

నూకాంబిక ఆలయ ముఖద్వార స్థాపన

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో ఆలయ పునర్నిర్మాణంలో ప్రధాన ఘట్టమైన ముఖద్వారం స్థాపన శనివారం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ బండారు ప్రసాద్, అర్చకులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కరు వెంకటలక్ష్మిని ప్రభుత్వం ఆదుకోవాలి

యూనియన్ తరుపున రూ.92 వేలు ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందిస్తున్న సిఐటియు, ఆశా యూనియన్ నేతలు

ప్రజాశక్తి -అనకాపల్లి

మండలంలోని తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మామూరు గ్రామానికి ఆశా కార్యకర్త డి.వెంకటలక్ష్మి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర్‌రావు, ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వి.సత్యవతి, జిల్లా కార్యదర్శి పార్వతి డిమాండ్ చేశారు. వెంకటలక్ష్మి మెదడు ఇన్ఫెక్షన్లతో విశాఖపట్నం ఆయుష్మాన్ ఆసుపత్రి ఐసీయూలో చికిత్స పొందుతుండగా, ఆమె చికిత్స నిమిత్తం ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలందరూ రూ.92వేలు ఆర్థిక సహాయాన్ని సమకూర్చగా ఆ మొత్తాన్ని నాయకులు శనివారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో వైద్య సేవలు అందిస్తున్న ఆశా కార్యకర్తలకు ప్రభుత్వం నుండి ఎటువంటి భద్రత లేదన్నారు. వెంకటలక్ష్మి కుటుంబానికి ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉందని ఆస్పత్రిలో వైద్యానికి లక్షల రూపాయలు ఖర్చు అవుతున్నాయని ఆమె వైద్యానికి అయ్యే ఖర్చు ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బి రామలక్ష్మి, కె.వరలక్ష్మి, జిల్లా కోశాధికారి సూర్యకళ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కశింకోట : వేసవి కాలంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తాళ్ళపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ రమేష్ అన్నారు. మండలంలోని చింతలపాలెం పాఠశాల వద్ద ఆరోగ్య సురక్ష శిబిరం శనివారం జరిగింది. డాక్టర్ సమత, సాయి కుందనా, సంధ్య రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఎం.ప్రసాద్, కుమకావ్య, భవానీ, శంకర్‌రావు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందికి ఆత్మీయ వీడ్కోలు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఈ నెలలో ఉద్యోగ విరమణ పొందనున్న పోలీస్ సిబ్బందికి జిల్లా ఎస్పీ కెవి.మురళీకృష్ణ శనివారం ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. ఆర్ముడు రిజర్వ్ ఎస్సై టి.అప్పారావు, చీడికాడ హెడ్ కానిస్టేబుల్ కుటుంబాలను శనివారం ఎస్పీ కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అన్ని ఉద్యోగాల్లో పోలీసు ఉద్యోగం చాలా ఒత్తిడితో కూడుకున్నదని, ప్రజలకు నేరుగా సేవలు అందించడం పోలీసు ఉద్యోగంలోనే జరుగుతుందని చెప్పారు. కానిస్టేబుల్ గా పోలీస్ శాఖలో ప్రవేశించి సుమారు 40 సంవత్సరాల పాటు విశేష సేవలు అందించి ఏఆర్ ఎస్సైగా, హెచ్‌సీగా ఉద్యోగ విరమణ పొందడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు బి.విజయభాస్కర్, పి.సత్యనారాయణరావు, డీఎస్పీలు బి.అప్పారావు, పి.నాగేశ్వరరావు, ఎఓ బి.శారద, ఇన్స్పెక్టర్లు చంద్రశేఖర్, అప్పలనాయుడు, సతీష్ పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతను నట్టేట ముంచిన జగన్

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్రంలో నిరుద్యోగ యువతను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నట్టేట ముంచారని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు ఆరోపించారు. స్థానిక టిడిపి పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జనవరి నెలలో నిరుద్యోగ యువకులకు జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని మాయమాటలు చెప్పి, 57 నెలల తర్వాత తూతూ మంత్రంగా డీఎస్సీ ప్రకటించి నిరుద్యోగ యువకులు ఆశలపై నీళ్లు చల్లారని మండిపడ్డారు. అనకాపల్లి జిల్లా నోబుల్ టీచర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు కాంగ్రెగుల సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం ఎన్నికలకు మూడు నెలలకు ముందు నోటిఫికేషన్లు ఇవ్వలేదని, మొట్టమొదటిసారిగా జగన్ రెడ్డి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చి ఒక్క ఉద్యోగం కూడా భర్తీ చేయలేని తొలి ప్రభుత్వంగా మిగిలిందని ఎద్దేవా చేశారు.

టిడిపి అభ్యర్థి రాజు ప్రచారం

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం నియోజకవర్గం టిడిపి అభ్యర్థి కెఎస్ఎన్ఎస్.రాజు శనివారం చోడవరం పట్టణంలోని పెద్ద వెలమ వీధి, వ్యాపార వీధి, భోలా వీధి, నౌడు వీధి, అన్నపూర్ణ వీధి, ఆంధ్ర బ్యాంకు రోడ్డులో ప్రచారం నిర్వహించారు. గతంలో తను ఎమ్మెల్యే ఉన్నప్పుడు చోడవరం అభివృద్ధి చేశానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జి మల్లు నాయుడు, జి వెంకట సత్యనారాయణ, టిడిపి మండల అధ్యక్షుడు నాగ గంగాధర్ జనసేన, టిడిపి, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో పాడి పశువులు సజీవదహనం

రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

మండలంలోని చిన్నప్పన్నపాలెం గ్రామంలో శనివారం జరిగిన అగ్నిప్రమాదంలో దొండా గణేష్‌కి చెందిన రెండు పాడి ఆవులు, ఒక దూడ సజీవ దహనమయ్యాయి. గ్రామ సమీపంలో పిచ్చి తుప్పలకు కొందరు నిప్పు పెట్టగా, అక్కడ నుండి మంటలు పశువుల పాకకు వ్యాపించాయి. దీంతో పాక పూర్తిగా దగ్ధం కాగా, ఆ పాకలో కట్టిన రెండు ఆవులు, పెయ్య సజీవంగా కాలి బూడిదయ్యాయి. దీంతో సంఘటనా స్థలం హృదయ విదారకంగా మారింది. ఆస్తి నష్టం రూ.2 లక్షలు వరకు ఉంటుందని బాధిత రైతు కన్నీరు మున్నీరుగా విలపించాడు. బాధిత రైతును టిడిపి నియోజకవర్గం అభ్యర్థి కెఎస్ఎన్ఎస్.రాజు, ఇన్చార్జి బత్తుల తాతయ్య బాబు తదితరులు పరామర్శించారు.

సకాలంలో చేరని అగ్ని మాపక శకటం

పశువుల పాకకు మంటలు వ్యాపించి, కాలిపోతున్న సంఘటనను చూసి 100కి కాల్ చేశామని, ఫైర్ స్టేషన్లకు ఫోన్లు చేసినా లైన్లు కలవలేదని గ్రామానికి చెందిన పలువురు యువకులు తెలిపారు. 100కి కాల్ చేస్తే తెలంగాణ రాష్ట్రానికి వెళ్తుందని, ఆంధ్రకు ఏ నెంబర్‌కు చేయాలో తెలియక ఇబ్బందులు పడ్డామని పేర్కొన్నారు ఘటన జరిగిన గంటన్నర తర్వాత ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరుకున్నాయని చెప్పారు. సకాలంలో అగ్ని మాపక శకటాలు ఘటనా స్థలాన్ని చేరుకొని ఉంటే కొంత వరకైనా ఆస్తి నష్టం తగ్గేదని పేర్కొన్నారు.

బాధిత రైతుకు ఆర్థిక సహాయం

చిన్నప్పన్నపాలెంలో శనివారం అగ్ని ప్రమాదంలో ఆవులు మృతి చెందిన నేపథ్యంలో బాధిత రైతు దొండా గణేష్ కుటుంబ సభ్యులకు విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. రెండు పశువులకు భీమా నగదు, పశువుల షెడ్ నిర్మాణానికి ఆర్థిక సాయం అందించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అగ్ని ప్రమాదంలో దగ్ధమైన పాక, సజీవదహనమైన ఆవులు

కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు దొండా సన్యాసిరావు, వైసిపి నాయకులు దొండ అచ్చెయ్యదొర, తమరాన దాసు, ముమ్మిన సూర్యనారాయణ, సుంకర బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో నియోజకవర్గానికి ఒక వీరప్పన్

ప్రజాశక్తి-అనకాపల్లి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో నియోజకవర్గానికి ఒక వీరప్పన్ తయారయ్యారని, గంజాయి డ్రగ్స్ ముఠాలతో కొంతమంది వైసిపి నాయకులకు సంబంధాలు ఉన్నాయని మాజీ మంత్రి, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ తీవ్రంగా విమర్శించారు. కొణతాల సుబ్రహ్మణ్యం కల్యాణ మండపంలో శనివారం టిడిపి బీసీ సాధికారత సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ల సురేంద్ర అధ్యక్షతన మున్సిపల్ పాత 16, 17, 20 వార్డుల టిడిపి, జనసేన, బిజెపి, శ్రేణులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీష్, లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, ఆయా పార్టీల నాయకులు పీలా రాముడు, కొణతాల అప్పలరాజు, డాక్టర్ నారాయణరావు, దాడి అప్పారావు, బుద్ద రాజేష్, విల్లూరి హరి, చదరం శివ అప్పారావు, కొణతాల వెంకట్రావు, దూలం గోపి, ధనాల విష్ణు చౌదరి, కొణతాల రత్నకుమారి, బుద్ద చంద్రవాణి, బొద్దపు ప్రసాద్, పోలవరపు త్రినాథ్, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని కొత్తపల్లిలో కూటమి అభ్యర్థి కొణతాల రామకృష్ణ శనివారం రాత్రి సమావేశం నిర్వహించారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ, టిడిపి నాయకులు గొంతుని శ్రీనివాసరావు, ఉగ్గిన రమణ మూర్తి, బుదిరెడ్డి గంగయ్య, నైనంశెట్టి రమణారావు, కలగ సోమేశ్వరరావు, సీరం వెంకట లక్ష్మి పాల్గొన్నారు.

వైసిపిలో చేరిన టిడిపి, జనసేన కార్యకర్తలు

ప్రజాశక్తి -చోడవరం : మండలంలోని అడ్డూరు గ్రామంలో టిడిపి, జనసేన పార్టీలకు చెందిన 40 మంది కార్యకర్తలు వైసిపి చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి, స్థానిక శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో శనివారం వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. వైసిపిలో చేరిన ఎలమంచిలి పెద్ద రమణ, ఎలమంచిలి చిన్న రమణ, ఎలమంచిలి సన్నిబాబు, బొడ్డేటి హరీష్, జోగా వెంకటరమణ, సానబోయిన మహాలక్ష్మి నాయుడు, నమ్మి రమణ, పోరా అప్పలనాయుడు, శరగడం కాశి, సానబోయిన నాయుడు, మామిడి చిన్న దాలినాయుడు, శ్రీను, నాయుడు తదితరులకు ధర్మశ్రీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు పట్ల ఆకర్షితులై పార్టీలు చేరినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిమ్మునాయుడు, బోరా రమేష్, ఎలమంచిలి శ్రీను, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

జనసేనలో పలువురు చేరిక

ప్రజాశక్తి- మునగపాక : మండలంలోని నాగులపల్లి ఎస్సీ కాలనీకి చెందిన పలువురు ఎలమంచిలి నియోజకవర్గ కూటమి అభ్యర్థి సుందరపు విజయకుమార్ సమక్షంలో శనివారం జనసేన పార్టీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో వారికి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి వైసిపి పాలనలో రాష్ట్ర ప్రజలు విసిగి వేసారిపోయారని, ప్రజలు మార్పును కోరుకుంటున్న తరుణంలో వైసిపిని ఓడించడమే ధ్యేయంగా ప్రతి ఒక్కరు కలిసి పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు జనపరెడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశురాం, ఏవి సత్యనారాయణ, కాళ్ల చంద్రమోహన్, ఆడారి శ్రీకాంత్, అల్లవరపు రమణబాబు, కే సరోజిని, దొక్కా మురళి,సూరిశెట్టి అప్పలనాయుడు, సరస్వతి, మాజీ సర్పంచ్ బాబ్జి, కార్లెడ్ల ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో శనివారం తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని పార్టీ నాయకులు బత్తుల తాతయ్యబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గోకవరం కోటేశ్వరరావు, దొంకిన అప్పలనాయుడు, కోరుకొండ రవికుమార్, దొడ్డి కిషోర్, కోట సత్యనారాయణ మరిసా సతీష్, సాయం శేషు, ఎంవివి సత్యనారాయణ, ముచ్చకర్ల తాతీలు, సయ్యపరెడ్డి శ్రీనివాసరావు, వజ్రపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైసిపి మండల ప్రధాన కార్యదర్శిగా కనకారావు

ప్రజాశక్తి- సబ్బవరం : వైసిపి మండల ప్రధాన కార్యదర్శిగా టెక్కలిపాలెం మాజీ సర్పంచ్ గవర కనకారావును ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆదేశాల మేరకు నియమించినట్లు వైఎస్ఆర్‌సిపి కేంద్ర కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది.

ఎన్నికలలో ఓటు వేసేందుకు

వికలాంగులు, వృద్ధులకు తగిన ఏర్పాట్లు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

ప్రజాశక్తి -అనకాపల్లి

రానున్న సార్వత్రిక ఎన్నికలలో వికలాంగులు, వృద్దులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవసరమైన సౌకర్యాలు, సౌలభ్యం కల్పించడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టరు రవి పట్టన్ శెట్టి తెలిపారు. కలెక్టరు కార్యాలయంలో శనివారం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 85 సంవత్సరాలు నిండిన వృద్దులు పోలింగ్ బూత్‌కు వచ్చేందుకు వీలుకాని వికలాంగులు వారి ఇంటివద్దే ఓటుహక్కు వినియోగించుకునే సౌకర్యాన్ని వినియోగించుకునేలా చూడాలని ఆదేశించారు. ఈ ప్రక్రియకు ముందుగా ఫారం-12డిలో బిఎల్వో ద్వారా దరఖాస్తు చేసి అనుమతి తీసుకోవాలన్నారు. మొబైల్ యాప్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. అయితే ఒకసారి అనుమతి పొందినట్లయితే ఇంటివద్దే ఓటు చేయవలసి వుంటుందన్నారు. వికలాంగులకు సహాయకుల విషయంలో కూడా ఇవే షరతులు వర్తిస్తాయన్నారు. ఈ ఓటింగ్ ప్రక్రియ వలన రహస్య ఓటింగ్ కు భంగం కలుగదన్నారు. అంధుల సౌకర్యం కొరకు బ్రెయిలీ లిపిలో వుండే మోడల్ బ్యాలెట్ పేపరు, ఒరిజనల్ బ్యాలట్ పేపరు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. సహాయకుల విషయంలో రాజకీయ పార్టీల ప్రమేయం ఏమాత్రం వుండదన్నారు. ఈ సమావేశంలో డిఎంహెచ్‌వో డాక్టర్ ఏ హేమంత్, డిఈవో ఎం.వెంకట లక్ష్మమ్మ, సాంఘిక సంక్షేమ శాఖ డిడి అజయ్ బాబు, వికలాంగుల శాఖ ఎడి జివిబి జగదీష్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు డి.రామ్మూర్తి, ఎమ్‌విఎస్ఎస్ అధ్యక్షులు పిఎస్‌టి.పట్నాయక్, బిసిటి కార్యదర్శి బి.శ్రీరామమూర్తి, విసిఎపి అధ్యక్షులు కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇకెవైసి కోసం గ్యాస్ ఏజెన్సీ వద్ద జనం బారులు

గ్యాస్ ఏజెన్సీ వద్ద బారులు తీరిన వినియోగదారులు

ప్రజాశక్తి - పరవాడ

ఈకేవైసీ చేయించుకోవడానికి గ్యాస్ వినియోగదారులు పరవాడలోని అపన ఇండియన్ గ్యాస్ కార్యాలయం వద్ద శనివారం బారులు తీరారు. కేంద్ర పెట్రోలియం శాఖ ఆదేశాల మేరకు గ్యాస్ వినియోగదారులు ఈ నెల 31వ తేదీలోగా ఈకేవైసీ ప్రక్రియ చేయించుకోవాలని పరవాడ అపన ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ వారి కార్యాలయం వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఇకేవైసీ చేసుకోపోతే గ్యాస్ రాదన్న ప్రచారం జరగడంతో అపన ఇండియన్ గ్యాస్ కార్యాలయం వద్ద శనివారం పెద్ద ఎత్తున జనాలు క్యూ కట్టారు. ఒకేసారి ఇంత పెద్ద ఎత్తున జనాలు తరలిరావడంతో ఏజెన్సీ సిబ్బంది అవాక్కాయ్యారు. ఈ సందర్భంలో జనాల మధ్య తోపులాట జరిగింది. కిలోమీటర్ మేరా మహిళలు, వృద్దులు మండుటెండలో నిలబడ్డారు. వినియోగదారులు గ్యాస్ బుక్ చేసుకుంటే గ్యాస్ ఇంటికి డెలివరీ చేసే సమయంలో డెలివరీ బాయ్ వినియోగదారుడు పేరు మీద ఈకేవైసీ ప్రక్రియ చేవట్టి వేలిముద్ర తీసుకోవాల్సి ఉంది.

వైపు గ్యాస్ సరఫరాలో అంతరాయం

మరో వైపు గ్యాస్ బుక్ చేసుకొని వారాలు గడుస్తున్నా గ్యాస్ ఇంటికి రావడం లేదని గ్యాస్ బాయ్‌ని సంప్రదిస్తే గ్యాస్ లోడ్ బండ్లు రావడం లేదని చెబుతున్నట్లు తెలిసింది. గ్యాస్ బుక్ చేసిన తరువాత ఓటీపీ జనరేట్ అవుతుందని, అయినా కూడా గ్యాస్ డెలివరీ చేయడం లేదని వినియోగదారులు చెబుతున్నారు. గ్యాస్ సరఫరా గుత్తేదారులు మారడంతో గ్యాస్ పంపిణీలో ఆలస్యం అవుతున్నట్లు సమాచారం. ఇదిఇలా ఉండగా మరో వైపు ఇకేవైసీ చేసుకోకపోతే గ్యాస్ రాదన్న భయం జనాల్లో ఉంది. దీనితో జనాలు కూలీ పనులు మానుకొని గ్యాస్ ఏజెన్సీకి పరుగులు తీస్తున్నారు.

బొగ్గు లారీల యజమానులపై చర్యలు తీసుకోవాలి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి

ప్రజాశక్తి - పరవాడ

మండలంలో పలు ప్రమాదాలకు కారణమవుతున్న బొగ్గు లారీల యజమానులపై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పరవాడ మండలంలో బొగ్గు లారీల వల్ల భారీ ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటిపై ఆర్టీవో, పోలీస్ అధికారులకు గతంలో అనేకమార్లు ఫిర్యాదు చేశామని, పట్టించుకోవడం లేదని విమర్శించారు. తాజాగా శుక్రవారం లంకెలపాలెంలో బొగ్గు లారీ కారణంగా భారీ ప్రమాదం జరిగిందన్నారు. బొగ్గు లారీలు అధిక లోడుతో నిబంధనలకు విరుద్ధంగా భారీ ఎత్తున బొగ్గుని రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్నాయని, దీంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అలాగే లంకెలపాలెం, పరవాడ, దేశపాత్రునిపాలెం, కలపాక వంటి గ్రామాల ప్రజలు తీవ్ర కాలుష్యం, ధూళితో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బొగ్గు లారీల వల్ల ద్విచక్ర వాహనదారులు ఈ మార్గంలో ప్రయాణించడానికి భయాందోళన చెందుతున్నారన్నారు. ఇప్పటికైనా బొగ్గు లారీలను ఈ రహదారుల గుండా రాకపోకలు సాగించకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి -అనకాపల్లి : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని దిశ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రాములమ్మ అన్నారు. అనకాపల్లి మండలం బగులువాడ పంచాయతీ దర్జీ కాలనీలో శనివారం శారద వ్యాలీ డెవలప్మెంట్ సమితి, లూపిన్ ఫార్మా కంపెనీ గత 60 రోజులుగా ఇస్తున్న ఉచిత కుట్టు శిక్షణా ముగింపు కార్యక్రమం జరిగింది. దిశా పోలీస్ స్టేషన్ ఎస్ఐ రాములమ్మ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మహిళలు నేడు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆడది అంటే అబల కాదు సబల అని నిరూపిస్తున్నారని తెలిపారు. లుపిన్ ఫార్మా కంపెనీ సైట్ హెడ్ రాజేష్ కేటీ మాట్లాడుతూ మహిళలకు అన్ని రంగాల్లో ప్రోత్సాహం అందిస్తామని, రానున్న రోజుల్లో మహిళలకు డ్రైవింగ్‌లో కూడా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. అనంతరం శిక్షణ పూర్తి చేసిన 60 మంది మహిళ సభ్యులకు సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో సంస్థ హెచ్ఆర్ మేనేజర్ ఎన్ శ్రీనివాసరావు, కార్యదర్శి జోగి నాయుడు, సిబ్బంది, దర్జీ కాలనీ మహిళలు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరి ఆలయం ప్రారంభం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని ముసిడిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన కన్యకా పరమేశ్వరి ఆలయాన్ని శనివారం ప్రారంభించారు. మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కోసం రూ.20 వేలు విరాళం కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సోమిరెడ్డి గోవింద సూర్యనారాయణ, పోతనవలస సర్పంచ్ సిరికి రమణ, టిడిపి సీనియర్ నాయకులు గంధం జగన్, సాంబమూర్తి, వెంకట్రావు, రెడ్డి అప్పలనాయుడు, కార్యకర్తలు, వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కాలనీల్లో కానరాని కనీస సౌకర్యాలు

- ఇళ్ల నిర్మాణానికి, నివాసానికీ ఇబ్బందులు
- రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి కల్పనలో నిర్లక్ష్యం
- అవస్థలు పడుతున్న లబ్ధిదారులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

అధ్వానంగా ఉన్న కాలనీ రోడ్డులో ముందుకు కదలనని మొరాయిస్తున్న కారు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల కేంద్రంలో ప్రభుత్వమిచ్చిన స్థలాల్లో నిర్మితమవుతున్న కాలనీలో కనీస సౌకర్యాలు లేక లబ్దిదారులు అవస్థలు పడుతున్నారు. రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ ఇతరత్రా అన్ని సౌకర్యాలను కల్పిస్తామని ప్రకటించినప్పటికీ, వాటిలో కొన్ని సౌకర్యాలైనా కనీసస్థాయిలో కల్పించలేని స్థితి ఉందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

మండల కేంద్రం కోటవురట్ల గ్రామంలో ఐదు లేఅవుట్లను ఏర్పాటు చేసి, 273మంది లబ్దిదారులకు ఇళ్లస్థలాలను, ఇళ్లను మంజూరు చేశారు. కోటవురట్ల బంకు సమీపంలో 167 ఇల్లు మంజూరు కాగా, వాటిలో 121మాత్రమే నిర్మాణంలో ఉన్నాయి. ఇక మహాలక్ష్మి గుడి వద్ద 53 ఇళ్లకుగాను, 30మంది మాత్రమే నిర్మాణం చేపడు తున్నారు. తుపాకీ గడ్డ వద్ద 23 ఇల్లు మంజూరు చేయగా, 16 ఇల్లు, కొమర వీధి వద్ద 28 ఇల్లు మంజూరు కాగా 24, కోదండ రామాలయం వద్ద 9 ఇల్లు మంజూరు చేయగా రెండు ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారు.

బురదగుంటలోని నీటితో చేపడుతున్న ఇళ్ల నిర్మాణం

అన్ని కాలనీల్లోనూ ఒకే రకమైన దుస్థితి

మండల కేంద్రంలోనే కేటాయించిన లేఅవుట్లలో ఏ ఒక్కదానిలోనూ కనీస సౌకర్యాలను కల్పించలేదని లబ్దిదారులు ఆవేదన చెందుతున్నారు. ఏ కాలనీలోనూ అంతర్గత రోడ్లు, కాలువలు నిర్మాణం చేపట్టలేదు. అంతేకాక ఐదు కాలనీల్లోనూ వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టకపోవడంతో లబ్దిదారులు తాగునీటికి, ఇంటి నిర్మాణపనులకు ఇబ్బంది పడాల్సి వస్తోందని ఆందోళన చెందుతున్నారు. పెట్రోల్ బంకు సమీపంలో ఏర్పాటు చేసిన కాలనీకి సక్రమంగా రోడ్డు లేకపోవడంతో, ఆ కాలనీలో ఇళ్ల నిర్మాణం పూర్తయి, ప్రారంభోత్సవాలు చేసుకున్నా, నివాసం ఉండేందుకు అవకాశం లేకుండా పోయింది, ప్రధానంగా అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉండడంతో రాత్రివేళల్లో నడిచి వెళ్లేందుకు కూడా అవస్థలు పడుతున్నారు. ఇక ఏమాత్రం చిన్న చినుకు కురిసినా ఆయా కాలనీల్లోని వీధుల్లోకి రాలేని దుస్థితి. ప్రస్తుతం వేసవి కావడంతో ప్రజలు తాగునీటికి అల్లాడే పరిస్థితి ఉంది, సొంతంగా కొందరు బోర్లు వేసుకున్నప్పటికీ, ప్రభుత్వపరంగా ఎటువంటి సౌకర్యాలు కల్పించక పోవడంపై లబ్దిదారులు ఆందోళన, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఎన్నికలు వచ్చేయడంతో నేతలు వీటిపై స్పందించే పరిస్థితి లేకున్నా, ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అధికారులు చొరవచూపి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. అంతర్గత రోడ్ల నిర్మాణంతో పాటు డ్రైనేజీలు, వాటర్ ట్యాంకు నిర్మాణాలు చేపట్టాలని అభ్యర్ధిస్తున్నారు.

సరైన రోడ్డు సౌకర్యంలేని కాలనీలోని ఒక వీధి

సరైన రోడ్డు సౌకర్యం లేక సగంలోనే ఆగిపోయిన ఇళ్ల నిర్మాణం

టిడిపి జిల్లా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన బాబ్జీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఇటీవల విశాఖపట్నం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా నియమింపబడిన గండి బాబ్జీ శనివారం జిల్లా టిడిపి కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. టిడిపి నేతలు ఆయనతో ప్రమాణం చేయించి అధ్యక్ష స్థానంలో కూర్చోబెట్టారు. అనంతరం జరిగిన సమావేశంలో పార్టీ విశాఖ పార్లమెంట్ అభ్యర్థి ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షునిగా పదవీ బాధ్యతలు చేపట్టిన బాబ్జీకి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పల్లా శ్రీనివాసరావు, దువ్వారపు రామారావు, గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు పాల్గొన్నారు.

చర్చి స్థలాన్ని ఏడు రోజుల్లో అప్పగించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరంలోని సిరిపురంలోగల 18 వేల గజాల చర్చి స్థలాన్ని ఎంపీ ఎంవివి.సత్యనారాయణ ఆక్రమించుకున్నారని, దీని విలువ రూ.550 కోట్లు ఉంటుందని, వారం రోజుల్లోగా ఆ స్థలాన్ని ఆయన చర్చి నిర్వాహకులకు అప్పగించాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కెఎ.పాల్ డిమాండ్ చేశారు. వారం రోజుల్లోగా స్థలాన్ని ఖాళీ చేసి అప్పగించకపోతే తాను న్యాయపోరాటం చేస్తానని హెచ్చరించారు. ఆశీలుమెట్టలోని తన ఫంక్షన్ హాలులో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. చిట్టివలస జ్యూట్ మిల్లును కూడా వైసిపి నేతలు ఆక్రమిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి, సినీ నటుడు బాబూ మోహన్, గాయత్రి పీఠం అధిపతి లలితామాత, పార్టీ సమన్వయకర్త బాబ్జీరావు, రవికుమార్ పాల్గొన్నారు.

బాల్య వివాహాల అనర్ధంపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న అంగన్వాడీ సూపర్‌వైజర్లు

ప్రజాశక్తి- కోటవురట్ల: బాల్యవివాహాలు చట్ట విరుద్ధమని, వాటి వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కలిగి, వాటి నిరోధానికి కృషి చేయాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు దుర్గాదేవి, హైమావతి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో బాలికలకు బేటి బచావో భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన తరువాతే బాలికలకు వివాహం చేసుకోవాలని, లేనిపక్షంలో చట్టపరంగా చర్యలకు గురౌతారని హెచ్చరించారు .అంతేకాక ఆరోగ్యరీత్యా 18ఏళ్ల నిండిన తర్వాతే వివాహం చేసుకోవడం మంచిదన్నారు.కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు ఎస్తేరు రాణి, పద్మజ, పుష్పకుమారి, మంగ ఫాతిమా, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాన్ని ఆపాలని వినతి

సిఐతో మాట్లాడుతున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్

ప్రజాశక్తి -నక్కపల్లి: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని సిఐ విజయ్‌కుమార్ అన్నారు.మండలంలోని చీడిక కొత్తూరు గ్రామంలో ఒక బాల్య వివాహం జరుగుతుందన్న సమాచారంతో ఐసిడిఎస్ సూపర్వైజర్ లలిత, విఆర్ఒ రాజు, స్వచ్ఛందసంస్థ ప్రతినిధి అమ్మాజీ శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సిఐ విజయ్ కుమార్‌ను కలిశారు. బాల్య వివాహం ఆపేందుకు బాలిక తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి, . బాల్య వివాహం జరగకుండా సహకరించాలన్నారు.

ఉపమాకకు పోటెత్తిన భక్తులు

ఉపమాక వెంకన్న దర్శనానికి బారులు తీరిన భక్తులు

ప్రజాశక్తి-నక్కపల్లి : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు పోటెత్తారు. దూరప్రాంతాల నుండి పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిట లాడింది. ఉపమాక క్షేత్రం భక్తుల గోవిందనామ స్మరణతో మారుమోగింది. భక్తులు క్యూలైన్ల గుండా గరుడాద్రి పర్వతంపై వేంచేసియున్న వెంకన్న నిజస్వరూపాన్ని, కొండ దిగువున ఉపాలయములో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవమూర్తులను, క్షేత్రపాలకుడు వేణు గోపాలస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు వరప్రసాదాచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్ధ ప్రసాదాలను అందజేసారు. .భక్తుల వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.

లింగంపేట నూకాలమ్మ ఘటాల ఊరేగింపు

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని లింగంపేట శ్రీనూకాలమ్మ అమ్మవారి ఘటాలను శనివారం ఊరేగించారు. లింగంపేట అమ్మవారి దేవాలయం నుంచి ఊరేగింపుగా జోగుంపేట వరకు ఘటాలను తీసుకెళ్లి అభిషేకించారు.ఏటా కొత్త అమావాస్యకు 10 రోజుల పాటు శ్రీనూకాలమ్మ అమ్మవారి జాతర సందర్భంగా తీర్థ మహోత్సవాలు ఘనంగా జరగనున్నాయి.

పలు గ్రామాల్లో 'రన్ ఫర్ జీసస్' ర్యాలీలు

అనకాపల్లిలో నిర్వహిస్తున్న 'రన్ ఫర్ జీసస్' ర్యాలీ

అనకాపల్లి :గుడ్ ఫ్రైడే, ఈస్టర్ పర్వదినాల సందర్భంగా అనకాపల్లి పట్టణంలో శనివారం క్రైస్తవ సంఘాలు, యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక సెంటినరీ బాప్టిస్ట్ చర్చి నుంచి నెహ్రూచౌక్, రింగ్ రోడ్, రైల్వే స్టేషన్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ప్ల కార్డులు, జెండాలు చేత పట్టుకొని ఆధ్యాత్మిక గీతాలను ఆలపిస్తూ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరాధన టీవీ అనకాపల్లి జిల్లా కన్వీనర్ రెవరెండ్ కే సన్నీ జేమ్స్ మాట్లాడుతూ ప్రపంచ మానవాళి రక్షణ కోసం యేసు క్రీస్తు తన ప్రాణాన్ని అర్పించి ముక్తిని ప్రసాదించారని తెలిపారు. పొరుగువారికి ప్రేమను పంచడమే క్రైస్తవ సిద్ధాంతమన్నారు. కార్యక్రమంలో యుపిఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ ప్రకాష్, యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు బిషప్ క్రాంతి పాల్, దైవజనులు కెపిడిఆర్ ప్రసాద్, యేసు రత్నం, రాజబాబు, వినోద్ అబ్రహం, సెంటినరీ బాప్టిస్ట్ చర్చ్ ప్రతినిధులు జోసెఫ్ ,అబ్రహం, కసింకోట ప్రతినిధులు పీటర్ వైస్ మాన్, మంత్రి జయ రజిని, పెద్ద సంఖ్యలో క్రైస్తవ సంఘాల నుంచి విశ్వాసులు పాల్గొన్నారు.

అనకాపల్లి డెస్క్ : ఈస్టర్ సండే, గుడ్ ఫ్రైడే సందర్భంగా నర్సీపట్నంలో శనివారం రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సిబిఎం కాంపౌండ్ చర్చి నుండి ప్రారంభమైన ర్యాలీ, అబీద్ సెంటర్, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా పెదబొడ్డేపల్లి వరకు సాగింది. అక్కడ మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ హాజరై క్రైస్తవ పెద్దలతో ముచ్చటించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ త్వరలో జరగబోయే ఎన్నికల్లో మంచి విజయం సాధించాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, తనకు ఆశీర్వాదం అందించాలని కోరారు.

ఆనందపురం : వేములవలస కూడలిలో ఆనందపురం పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం ఈస్టర్‌ను పురస్కరించుకుని మండలంలోని క్రైస్తవ పెద్దలు, విశ్వాసులు కలిసి శనివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. దేశ, రాష్ట్ర, ప్రజల శాంతి, ఐక్యత కలిగిఉండాలని, ఆయురారోగ్యముతో వర్ధిల్లాలని ప్రార్థనలు జరిపారు. ఇందులో భాగంగా రన్ ఫర్ జీసస్ నిర్వహించారు. ఈ ర్యాలీకి ముఖ్య అతిథిగా రెవరెండ్ గరికిముక్కల పాల్ విక్టర్ హాజరై సందేశం ఇస్తూ... క్రీస్తు మానవుల పాప, పరిహారంగా సిలువ యాగం అయ్యారని, మూడవ దినాన ఆయన చెప్పినట్లే తిరిగి లేచారని, ఆ దినాన్ని ఈస్టర్ పండుగ జరుపుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ పిడి ప్రభాకర్, ప్రభుదాస్, ఆనందరావు, హనుకు, శాంతిరాజు, బొత్స డేవిడ్, ముదపాక అబ్రహం, జంగం జోషి, సుమారు 300 మంది క్రైస్తవులు పాల్గొన్నారు.

'ఉపాధి' వేతనాన్ని పెంచాలని నిరసన

ఆదివాసీ గిరిజన సంఘం, వ్యకాస ఆధ్వర్యంలో పలుగు, పారలతో నిరసన చేస్తున్న గిరిజన ఉపాధి కూలీలు

ప్రజాశక్తి -కొత్తకోట : ఉపాధి హామీ పథకం కింద కూలీలకు రోజువారీ కనీస వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రావికమతం మండలంలో చీమలపాడు శివారు అజయ్‌పురంలో శనివారం ఆదివాసి గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ఉపాధి కూలీల ఆధ్వర్యంలో నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు కె.గోవిందరావు, మండల శాఖ కార్యదర్శి చంద్రయ్య మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద ఆదివాసీ కూలీలకు కనీస రోజుకూలీ రూ.600 ఇవ్వాలని కోరుతుంటే రూ.27 మాత్రమే పెంచడం అన్యాయమన్నారు. ఏడాదిలో 100 రోజులు పని దినాలను 200 పెంచాలన్న డిమాండ్ ను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం లేదని ఆరోపించారు. గతంలో ఇస్తున్న రూ 273 లకు మరో రూ 27 కలిపి రూ 300 ఇస్తామని ప్రకటించడం దారుణమని వాపోయారు. నరేంద్ర మోడీ గద్దెనెక్కిన తర్వాత నేటి వరకు నిత్యవసర సరుకులు ధరలు ఆకాశాన్నంటుతున్న చాలీచాలని కూలితో కుటుంబపోషణ ఎలా సాగుతుందని ప్రశ్నించారు. కనీస వేతనం చట్ట ప్రకారం రూ.400 చెల్లించాల్సి ఉండగా, మోడీ ప్రభుత్వం ప్రకటించిన ఉపాధి పథకం కూలిరేట్లు, కనీసం వేతనం చట్టం కంటే తక్కువగా ఉంద న్నారు.బడ్జెట్లో ఉపాధి పథకం నిధులు తగ్గిస్తూ. నేటికీ బకాయిలు చెల్లించకపోవడం దుర్మార్గమని, ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరారు. గిరిజన ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

విద్యార్థినులపై దాడులను అరికట్టాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నిరసన

నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్ : విద్యార్థినులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జి.గీతాకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద విశాఖలో రూపశ్రీ ఆత్మహత్య చేసుకోవడాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గీతాకృష్ణ మాట్లాడుతూ విశాఖలోని చైతన్య విద్యాసంస్థలు వేధింపులు వల్లే రూపశ్రీ ఆత్మహత్య చేసుకుందన్నారు. విద్యార్థులపై విద్యాసంస్థలు ఇంత దారుణానికి దిగజారడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో తరచూ ఇటువంటి ఘటనలు చోటుచేసుకుంటున్నా, వాటిని అరికట్టడంతో ప్రభుత్వ యంత్రాంగం విఫలం కావడంపై ఆవేదన వ్యక్తం చేశారు. రూపశ్రీ కుటుంబాన్ని ఆదుకొని న్యాయం చేయాలని, అలాగే విద్యాసంస్థలపై, ఘటనకు బాధ్యులైన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాతవరం మండల సెక్రెటరీ రాజు, మహిళా కన్వీనర్లు పాల్గొన్నారు.

1 నుంచి పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

ప్రభుత్వ పాలిటెక్నికల్ కాలేజీ

ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్ : రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాలకు నిర్వహించే పాలిసెట్ 2024 ప్రవేశ పరీక్షకు నర్సీపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఉచిత శిక్షణనివ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జివి.రామచంద్రరావు ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మరెన్ని వివరాలకు 7993320634, 9494420962, 8106846727, 9912043417 మొబైల్ నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మహాలక్ష్మినాయుడు సేవలు ప్రశంసనీయం

◆ జిల్లా విద్యాశాఖాధికారి ఎం. వెంకటలక్ష్మమ్మ



మహాలక్ష్మినాయుడును సన్మానిస్తున్న డిఇఒ

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం మండలం మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్, ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మినాయుడు సేవలు అభినందనీయమని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ కొనియాడారు. శనివారం అనకాపల్లిలోని జివిఎంసి టౌన్ గర్ల్స్ హైస్కూల్లో జిల్లాలో ఉన్న హైస్కూల్ ప్రధానోపాధ్యాయులకు, భవిత సెంటర్లు ఉన్న స్కూల్ ప్రధానోపాధ్యాయులకు, సిడిపిఒలు, అంగన్వాడీ సూపర్‌వైజర్లుకు, పాఠశాల స్థాయిలో సహిత విద్య కార్యకలాపాలపై జిల్లాస్థాయిలో ఒక రోజు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వికలాంగ బాలలకు మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్, ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మినాయుడు అందిస్తున్న సేవలను ప్రశంసించారు. కొన్నాళ్లుగా రావికమతం మండల భవిత కేంద్రం నిర్వహణలో వికలాంగులకు అందిస్తున్న సేవలతోపాటు రాష్ట్రంలోని 26 జిల్లాల్లో ప్రత్యేక ఉపాధ్యాయులకు డిజిటల్ విద్యపై ఇచ్చిన శిక్షణలో రాష్ట్ర రిసోర్స్‌పర్సన్‌గా మహాలక్ష్మినాయుడు అందించిన సేవలను ప్రశంసిస్తూ, జిల్లా సహిత విద్య సమన్వయకర్త బి.శకుంతల అభినందించి, దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమం లో జిల్లాలోని పాఠశాలల హెచ్ఎంలు అంగన్వాడి సూపర్వైజర్లు, వైద్యశాఖ సిబ్బంది, జిల్లా రిసోర్స్ పర్సన్లు దేముడుబాబు, బివి.వరప్రసాద్, ప్రత్యేక ఉపాధ్యాయులు జగన్నాథనాయుడు, దేవుడునాయుడు పాల్గొన్నారు

నిర్భయంగా ఓటేయండి

గ్రామాల్లో నిర్వహిస్తున్న పోలీసు కవాతు

ప్రజాశక్తి-గొలుగొండ : రానున్న ఎన్నికల్లో ఓటు హక్కును సజావుగా వినియోగించుకోవాలని ఎస్ఐ కృష్ణారావు సూచించారు. ప్రశాంత ఎన్నికలకు భరోసానిస్తూ శనివారం గొలుగొండ మండలం గుండుపాల, చీడిగుమ్మల, ఎర్రవరం, జోగుంపేట గ్రామాల్లో కేంద్ర బలగాలచే పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కృష్ణారావు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజలు తమ ఓటును నిర్భయంగా వేసేందుకు పోలీసుశాఖ పరంగా అవసరమైన భద్రత కల్పిస్తామని నమ్మకం, భరోసా కల్పించేందుకు ఈ కవాతు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిఎస్‌పి మోహన్‌తో పాటు 40 మంది ఎపిఎస్‌పి సిబ్బంది పాల్గొన్నారు.

అనురాధ ఎంపిక అభినందనీయం



ఎమ్మెల్యే అభ్యర్థిని సత్కరిస్తున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి - చీడికాడ : మాడుగుల నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తనయ ఈర్లె అనురాధను ఎంపిక చేయడం అభినందనీయమని మండలంలోని జి కొత్తపల్లి గ్రామానికి చెందిన వైసిపి శ్రేణులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. శనివారం గ్రామానికి చెందిన కొల్లి మహాలక్ష్మి నాయుడు, కొల్లి శ్రీనివాస్, కొల్లి వెంకటరావు, పుట్ట రామ్ కుమార్‌తో పాటు పలువురు కార్యకర్తలు తారువలోని వైసిపి కార్యాలయానికి వెళ్లి ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధను అభినందించారు. దుశ్శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాడుగులలో వైసిపి విజయానికి తమవంతు కృషి చేస్తామని, తండ్రిబాటలోనే అనురాధను ఎమ్మెల్యేను చేసేందుకు సహకరిస్తామన్నారు.

ఎన్నికల కోడ్ అమలుకు చర్యలు

◆ ఎన్నికల రిటర్నింగ్ అధికారి గీతాంజలి

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఒ గీతాంజలి

ప్రజాశక్తి- కోటవురట్ల: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల నిబంధనల అమలుకు సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని పాయకరావుపేట నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి గీతాంజలి స్పష్టం చేశారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలింగ్ బూత్ కేంద్రాల వద్ద అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దీనికిగాను మాక్ పోలింగ్, కౌంటింగ్ వంటి కార్యక్రమాలు చేపట్టడంతో పాటు గ్రామీణ ప్రాంత ప్రజలకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.

అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో 292 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వీటిలో కోటవురట్లలో 52, నక్కపల్లిలో 75, పాయకరావుపేటలో 90, రాయవరంలో 75 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, మొత్తంగా 2,47,508, ఓటర్లు ఉన్నారని, వీరిలో 1,21,911 మంది పురుషులు, 1,21,595 మంది స్త్రీలు, ఇద్దరు థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 28సెక్టార్లుగా విభజించి వాటికి అధికారులను కేటాయించి, వారి ఆధ్వర్యంలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. నియోజకవర్గంలో 49 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి, ఆయా కేంద్రాల్లో ఎన్నికలు శాంతియుతంగా నిర్వహణకు అవసరమైన చర్యలు చేపడతామని వెల్లడించారు.

ఎన్నికల నోటిఫికేషన్లు విడుదలై, నామినేషన్ల దాఖలు చివరి రోజు వరకు ఓటర్ల నమోదుకు అవకాశం ఉందని అందుకు ఫారం6 దరఖాస్తులను అప్పటివరకు సమర్పించవచ్చు న్నారు. ఎన్నికల కోడ్ పక్కాగా అమలుకు అన్ని చర్యలు చేపడుతున్నామని, రాజకీయపార్టీలు, ప్రజలు సహకరించాలని కోరారు. ఎన్నికల్లో మద్యం, నగదు, ఇతరత్రా ప్రలోభపెట్టే చర్యలకు అస్కారం లేకుండా పటిష్టమైన నిఘా కొనసాగుతుందని, పోలీస్ చెక్‌పోస్టును కూడా ఏర్పాటు చేశామన్నారు అనంతరం మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు కార్యక్రమంలో తాహశీల్దార్ వెంకటరమణ, ఎంపిడిఒ కాశీ విశ్వనాధరావు, ఎస్ఐ రమణయ్య, ఉప తహశీల్దార్ అన్నాజీరావు, పలువురు సెక్టార్ రూట్ ఆఫీసర్లు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.